చరిత్ర సృష్టించిన సంజూ శాంసన్..




మానేరు **జనత** ®

తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

7.3.2026 శనివారం Saturday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 317 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్



# ప్రజల మద్దతుతో
# పాలన సాగిస్తున్నాం

## మీ అందరి మద్దతునే గెలిచాం

### మాటలు, మూటలతో గెలిచి రాలేదు
### మా వద్ద ఎలాంటి అక్రమ సంపాదనా లేదు
### వర్గీకరణ కోసం చేసిన పోరాటానికి మద్దతుగా నిలిచా
### మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశంలో రేవంత్ రెడ్డి

**జనతా న్యూస్, హైదరాబాద్ :** చిత్తశుద్ధితో ప్రజాసమస్యలు పరిష్కరిస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. శుక్రవారం హైదరాబాద్ శిల్పకళావేదికలో మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా సీఎం రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పుడున్నది మీరంతా కోరుకున్న ప్రభుత్వమని తెలిపారు. ఇది మీరంతా కష్టపడి

మిగతా 2 లో

## మూసీ చుట్టూ నైట్ టూరిజం అభివృద్ధి

కొత్వాల్ గూడ ఎకో పార్క్ ప్రారంభించిన సీఎం రేవంత్






### ప్రజలను ఏమార్చే
# పాలన

## రెండేళ్లుగా అదే చేస్తున్నారు

### మరోమారు ప్రజలను మోసం చేసే యత్నం
### గతంలో ఇచ్చిన దరఖాస్తులకే దిక్కులేదు
### 99 రోజుల ప్రజాపాలనపై మండిపడ్డ హరీష్ రావు

గతంలో రెండుసార్లు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి తీసుకున్న లక్షలాది దరఖాస్తులు పరిష్కారం కాక ఇంకా చెత్తబుట్టల్లోనే మగ్గుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ దరఖాస్తులకు దిక్కు లేదు కానీ, మళ్లీ ఇప్పుడు పది వారాల పాటు పది రకాల నాటకాలతో ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం కావడం సిగ్గు చేటని అన్నారు.



3




3

## కేసీఆర్‌ను కలిసిన బాల్క సుమన్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ శుక్రవారం కలిశారు. ఇటీవల క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులో అరెస్టై జైలుకు వెళ్లి వచ్చిన బాల్క సుమన్ తొలిసారి కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

### ఇజ్రాయిల్‌పై తీవ్రమైన
# ఇరాన్ ప్రతిదాడులు

## డిమోనా అణు కేంద్రంపై దాడికి ఇరాన్ గురి



ఇజ్రాయిల్ దాడులకు ప్రతిదాడులను ముమ్మరం చేసిన ఇరాన్ ఇజ్రాయెల్ అణు రియాక్టర్‌పై గురిపెట్టిందన్న వార్తలు వస్తున్నాయి. ఇజ్రాయిల్ అణు కేంద్రాన్ని ధ్వంసం చేస్తామని ప్రకటించింది. ఇజ్రాయెల్ తన అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను డిమోనాకు రక్షణగా మోహరించింది. ప్రపంచంలోనే అత్యంత దుర్భేధ్యమైన ప్రదేశంగా మార్చేసింది.

4

### 9నుంచి పార్లమెంట్
# రెండోదశ సమావేశాలు

ఈ సమావేశాల్లోనే స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాసం

ఎంపిలకు విప్ జారీ చేసిన బిజెపి, కాంగ్రెస్ పార్టీలు

.. వివరాలు 4లో

### సివిల్స్ ఫలితాలు
# విడుదల

సత్తా చాటిన తెలుగు అభ్యర్థులు

అనూజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్

.. వివరాలు 2లో

### మూడు వారాల్లో
# క్యాతన్‌పల్లి ఎన్నిక

## ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం




02

క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక మూడు వారాల్లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. క్యాతనపల్లి మున్సిపాలిటీ వివాదంపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టుపై విధంగా ఆదేశించింది.

## రాజ్యసభ నామినేషన్ల పరిశీలన

స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ

సింఘ్వీ, వేం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లే

.. వివరాలు 2లో

# రాజ్యసభ నామినేషన్ల పరిశీలన


## స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ

## సింఘ్వీ, వేం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లే

**హైదరాబాద్,మార్చి 6 :** రాజ్యసభ అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ల పత్రాలు పరిశీలన శుక్రవారం పూర్తయింది. ఈ సందర్భంగా ఈ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన సాయి అనే వ్యక్తి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. రాజ్యసభ అభ్యర్థిగా బలపరుస్తూ 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు నామినేషన్ పత్రాలు ఉండాలని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. కానీ ఆ సంతకాలు సాయి దాఖలు చేసిన నామినేషన్ పత్రాలపై లేవని అధికారులు వివరణ ఇచ్చారు. అందువల్ల ఈ పత్రాలను తిరస్కరించినట్లు వారు తెలిపారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నుంచి రాజ్యసభ బరిలో నిలిచిన అభ్యర్థులు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. అభిషేక్ సింఘ్వీకి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం వరుసగా మరోసారి అవకాశం కల్పించింది. ఇక వేం నరేందర్ రెడ్డిని తొలిసారిగా రాజ్యసభకు ఎంపిక చేసింది. అసలు అయితే రాజ్యసభ సీటు ఒకటి అభిషేక్ మను సింఘ్వీకి కేటాయిస్తున్నట్లు పార్టీ అధిష్ఠానం గతంలో ప్రకటించింది. ఇక మరో రాజ్యసభ పదవి కోసం కాంగ్రెస్ పార్టీలో చాలా మంది పోటీ పడ్డారు. దాదాపు 16 మందితో కూడిన జాబితాను సిద్ధం చేసి .. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి తీసుకు వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానంతో చర్చించి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని ఎంపిక చేశారు. వివాదరహితుడు కూడా కావడంతో.. ఆయన వైపు అధిష్ఠానం మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

# మూడు వారాల్లో క్యాతన్ పల్లి ఎన్నిక

## ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం




**హైదరాబాద్, మార్చి 6 :** క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక మూడు వారాల్లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. క్యాతనపల్లి మున్సిపాలిటీ వివాదంపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు పై విధంగా ఆదేశించింది. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లిలో పలు రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక అర్ధంతరంగా నిలిచిపోయింది. ఇక బీఆర్ఎస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనకు కోర్టు రిమాండ్ విధించింది. బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించగా.. ఇటీవల బెయిల్ మంజూరు అయింది. అనంతరం ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. ఆ తర్వాత కేతనపల్లిలోని తన నివాసంలో బాల్క సుమన్ విలేకర్లతో మాట్లాడుతూ.. స్థానిక ఎంపీ వంశీ కృష్ణ, ఎమ్మెల్యే వివేక్‌పై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. తనను జైల్లో తీవ్ర ఇబ్బందులకు గురి చేశారంటూ పోలీసులపై ఆయన మండిపడ్డారు. ఫిబ్రవరి 11వ తేదీన తెలంగాణలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు పోలింగ్ నిర్వహించారు. ఫిబ్రవరి 14వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. అనంతరం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మన్లు, వైస్ చైర్మన్ పదవుల ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అలాగే క్యాతనపల్లిలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వేళ.. ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఆగిపోయింది. దీనిపై బీఆర్ఎస్ పార్టీ నేతలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు పై విధంగా ఆదేశాలు జారీ చేసింది.

# బేగంపేట వాతావరణ శాఖ కార్యాలనికి బాంబు బెదింపు

## తనిఖీలు చేపట్టి ఫేక్ కాల్‌గా గుర్తింపు

**హైదరాబాద్,మార్చి6 :** ఇటీవల విమానాశ్రయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు 'ఫేక్ బాంబ్ బెదిరింపులు' రావడం ఎక్కువైంది. తాజాగా.. హైదరాబాద్‌లోని బేగంపేటలో బాంబు బెదిరింపు కలకలం రేపింది. వాతావరణ శాఖ కార్యాలయానికి వచ్చిన ఈ బెదిరింపుతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. వెంటనే కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. అయితే బాంబు బెదిరింపుతో కార్యాలయంలోని సిబ్బంది, ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ కేంద్రానికి గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బాంబు బెదిరింపు రావడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలు కార్యాలయం అంతటా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాయి. నిత్యం వాతావరణ సమాచారంతో బిజీగా ఉండే అధికారులు, సిబ్బంది ఈ ఆకస్మిక పరిణామంతో తీవ్ర టెన్షన్‌లో ఉన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా సిబ్బందిని కార్యాలయం బయటకు పంపినట్లు సమాచారం. ఇటీవల 'ఫేక్ బాంబ్ బెదిరింపులు' రావడం ఎక్కువైంది. ఇది కూడా అలాంటి ఆకతాయిల పని అయి ఉంటుందని ప్రాథమికంగా భావిస్తున్నప్పటికీ, పోలీసులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా తనిఖీలు కొనసాగిస్తున్నారు. ప్రజలు భయాందోళన చెందవద్దని, పోలీసులు పరిస్థితిని సమీక్షిస్తున్నారని అధికారులు తెలిపారు. నిందితులను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ విభాగం కూడా రంగంలోకి దిగినట్లు సమాచారం.

# ఈనెల 8,9 తేదీల్లో మెగా రైతు మేళా

## అగ్రికల్చర్ వర్సిటీ విసి వెల్లడి

**హైదరాబాద్,మార్చి6 :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 8,9 తేదీల్లో మెగా రైతు మేళాను నిర్వహిస్తున్నామని విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వెల్లడించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజేంద్ర నగర్ లోని విశ్వవిద్యాలయంలో రైతు మేళాను విజయవంతం చేయాలని కోరారు. మహిళా రైతుల సాధికారిత లక్ష్యంగా నిర్వహించనున్న ఈ మేళకు సుమారు 8 నుంచి 10 వేల మంది మహిళా రైతులు హాజరవుతున్నారని వివరించారు.రెండు రోజుల మెగా మహిళా రైతు మేళాలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న కీలక సవాళ్లు, వాటి పరిష్కారాల పై శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులతో ముఖాముఖి కార్యక్రమాలు ఉంటాయన్నారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ పరిధి లోని సెర్ప్‌కు చెందిన సుమారు మూడు వేల మంది మహిళా రైతులు ఈ కార్యక్రమానికి హాజరు అవుతారన్నారు.వివిధ ఆధునిక సాంకేతిక అంశాలపై సుమారు 70 నుంచి 80 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.అధిక రసాయన ఎరువుల వాడకం వల్ల వచ్చే దుష్ప్రభావాలు, మార్కెట్‌లో గిరాకీ ఉన్న వరి రకాల సాగు వంటి అంశాలపై విశ్వవిద్యాలయం విద్యార్థిని, విద్యార్థులచే ఆటా, పాట కార్యక్రమాలుంటాయని తెలిపారు.

# ప్రజల మద్దతుతో పాలన సాగిస్తున్నాం

మొదటి పేజీ తరువాయి



తెచ్చుకున్న ప్రభుత్వమని పేర్కొన్నారు. ఎన్నికల్లో మీరంతా తమకు అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. మార్పు కోసమే ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని వివరించారు. తమది పేదల పక్షపాత ప్రభుత్వమని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. గత పాలకులు ఎన్నో అక్రమాలు చేశారని సీఎం రేవంత్ విమర్శించారు. గత ఎన్నికల్లో తాము మాటలు, మూటలతో గెలవలేదని కుండబద్దలు కొట్టారు. కేవలం ప్రజల మద్దతుతోనే తాము అధికారంలోకి వచ్చామని చెప్పారు. తమ వద్ద ఎలాంటి అక్రమ సంపాదన లేదన్నారు. వర్గీకరణ కోసం మాదిగ జాతి ఎంతో పోరాడిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ గుర్తు చేశారు. ఈ పోరాటంలో కొందరు ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏళ్ల నుంచీ వర్గీకరణ సమస్య ఉందన్నారు. మీ న్యాయమైన హక్కు కోసం మొదటి నుంచీ మద్దతుగా ఉన్నానని తెలిపారు. వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సైతం పంపామని వివరించారు. మిత్రుడి కోసం కొన ఊపిరి వరకు కర్ణుడు నిలబడ్డాడని చెప్పారు. కర్ణుడి మాదిరిగా మిత్రధర్మానికి కట్టుబడి మాదిగల వెంట నిలబడ్డామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. వర్గీకరణ అంశంలో మాదిగల వైపు న్యాయం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా మీవైపే నిలబడ్డామని ఆయన స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత.. వర్గీకరణ కోసం ప్రకటన చేసిన తొలి రాష్ట్రం తెలంగాణనేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తమ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లు ప్రభుత్వ ఉద్యోగులేనని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాతే అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చామన్నారు. ప్రగతి ప్రణాళికలో జాగ్రత్తగా వ్యవహరించాలని ఉద్యోగులకు సీఎం రేవంత్ హితవు పలికారు. తెలంగాణలో ఆర్థిక సమస్యలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం వద్ద పంచడానికి భూములు లేవన్నారు.ప్రభుత్వ ఆర్థిక వెసులుబాటు అంతంత మాత్రంగానే ఉందని తెలంగాణ సీఎం తెలిపారు. మాదిగలకు మెరుగైన విద్య అందించాలన్నదే తమ ఆలోచన అని పేర్కొన్నారు. ప్రక్షాళన చేసేందుకే విద్యాశాఖను తన వద్ద పెట్టుకున్నానని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బర్రెలు, గొర్రెలు, చేపలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇవన్నీ మనకు తెలియవా?.. వీళ్లు కొత్తగా ఇచ్చిందేంటి? అంటూ బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్ మండిపడ్డారు. మనం బర్రెలు, గొర్రెలు కాచుకోవాలా?.. వాళ్ల పిల్లలు రాజ్యం ఏలుతారా? అంటూ ఆ పార్టీ నేతలను సీఎం రేవంత్ సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కడియం శ్రీహరి, ఎంపి కడియం కావ్య, దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# మూసీ చుట్టూ నైట్ టూరిజం అభివృద్ధి

## కొత్వాల్ గూడ ఎకో పార్క్ ప్రారంభించిన సీఎం రేవంత్

**రంగారెడ్డి,మార్చి6 :** మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. మూసీ చుట్టూ వ్యాపారాలు, నైట్ టూరిజం అభివృద్ధి చేస్తామన్నారు. రంగారెడ్డి జిల్లాలోని కొత్వాల్‌గూడ ఎకో పార్కును శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫామ్‌హౌస్‌లో ఉన్నవారికి పేదల కష్టాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. నేను సీఎం అయిన తర్వాత రేషన్ కార్డు ఇచ్చా. సన్నబియ్యం ఇచ్చా. ఫ్రీ బస్సు పథకం ఇచ్చా. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మహిళలంతా నిండు మనసుతో ఆశీర్వదించాలని అన్నారు.మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందాం. అభివృద్ధి విషయంలో రాజకీయాలు లేవు. అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయ ఉపన్యాసాలకు తావులేదు. అందర్నీ కలుపుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంవైపు నడిపిస్తా అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కొత్వాలగూడలో ఎకో హిల్ పార్క్ ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బుద్వేల్ లేఅవుట్‌తో



కలిపే రేడియల్ రోడ్-2 ఇంటర్‌చేంజ్‌కు శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి,ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి,మల్లు రవి,ఎంఎల్ ఏలు ప్రకాష్ గౌడ్, మల్‌రెడ్డి రంగా రెడ్డి ,సీఎం మాజీ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులుహాజరయ్యారు. ఈ సందర్భంగా ఎకో హిల్ పార్క్ ను సీఎం రేవంత్ రెడ్డి సందర్శించి పరిశీలించారు.

# సివిల్ సర్వీసెస్‌లో ఎస్సీ స్టడీ సర్కిల్ విద్యార్థుల ప్రతిభ

## స్టడీ సర్కిల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులకు ర్యాంకులు

## జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించడం రాష్ట్రానికి గర్వకారణం

## ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్,మార్చి6 :** దళిత వర్గాల యువతకు నాణ్యమైన శిక్షణ అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితంగా ఈ విజయాలు సాధ్యమయ్యాయని ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన సివిల్ సర్వీసెస్ పరీక్ష-2025 తుది ఫలితాల్లో తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించినట్లు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలిపారు. వరంగల్ జిల్లాకు చెందిన ఆశిష్ దేశవ్యాప్తంగా 676 ర్యాంక్ సాధించగా, ములుగు జిల్లాకు చెందిన ఆ. ప్రవీణ్ కుమార్ 793 ర్యాంక్ సాధించారు. వీరికి ఇండియన్ పోలీస్ సర్వీస్ పొందే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. గత సంవత్సరం మే నెలలో నిర్వహించిన




సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షల్లో తెలంగాణ ఘాఅ స్టడీ సర్కిల్‌కు చెందిన 27 మంది విద్యార్థులు అర్హత సాధించి, ఆగస్టులో జరిగిన మెయిన్స్ పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. అందులో 7 మంది విద్యార్థులు ఇంటర్వ్యూకు అర్హత సాధించగా, చివరకు ఇద్దరు తుది ఎంపిక సాధించడం గర్వకారణమని మంత్రి అన్నారు. ఇటీవల ప్రకటించిన తెలంగాణ గ్రూప్?ఎ ఫలితాల్లో కూడా తెలంగాణ ఘాఅ స్టడీ సర్కిల్ విద్యార్థులు దాదాపు 33 ర్యాంకులు సాధించడం సంస్థ శిక్షణ నాణ్యతకు నిదర్శనమని మంత్రి వివరించారు. సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... దళిత వర్గాలైన నిరుద్యోగ యువతకు ఉన్నత స్థాయి శిక్షణ అందించి రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఎక్కువ మంది ఎంపిక కావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

లక్ష్యాన్ని సాధించడానికి అవసరమైన నిధులు, సదు-పాయాలను సమయానికి అందిస్తూ అన్ని విధాలా సహకరిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి మరియు ఉప ముఖ్యమంత్రికి మంత్రి తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలోని దళిత అట్టడుగు వర్గాల నుండి మరింత మంది యువత సివిల్ సర్వీసెస్ వంటి అత్యున్నత పరీక్షల్లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ, ఈసారి ఎంపికైన ఆశిష్ మరియు ప్రవీణ్ కుమార్‌లకు మంత్రి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. వారి విజయం భవిష్యత్తులో మరెందరో యువతకు ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన కోచింగ్ అందించి వివిధ పోటీ పరీక్షల్లో అగ్రస్థానాలు సాధించేలా కృషి చేసిన తెలంగాణ ఘాఅ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీ ం. నరసింహ రెడ్డి మరియు సంస్థ సిబ్బందిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. వారి కృషి ఫలితంగా తెలంగాణలోని ఎస్సీ వర్గాలకు చెందిన పేద అభ్యర్థులు ఇప్పటివరకు 1000కు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందారని ఆయన పేర్కొన్నారు.

# ఎనుమాముల మార్కెట్లో మిర్చి రాసులు

## భారీగా తరలి వచ్చిన బస్తాలు

**వరంగల్,మార్చి6 :** వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు భారీగా మిర్చి రావడంతో మార్కెట్ ఎరుపెక్కింది. వరుసగా రెండ్రోజుల నుంచి సుమారు 35 నుంచి 40వేల బస్తాల మిర్చి అమ్మకానికి వచ్చింది. ఈ సీజన్‌లో ఇదే అధికం. దీంతో యార్డులో ఎటు చూసినా మిర్చి బస్తాలే దర్శన మిచ్చాయి. మిర్చి ధరలు గత సంవత్సరంతో పోలిస్తే మెరుగ్గా ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, మార్కెట్‌లో మంచి నాణ్యత ఉన్న మిర్చికి గరిష్టంగా పలికిన ధరలు ఇలా ఉన్నాయి... తేజ రకం మిర్చి క్వింటాకు రూ.18,800, వండర్‌హాట్ రూ. 35వేలు, యూఎస్.341 రూ.21వేలు, దీపిక రూ. 30వేలు, ఎల్లోమిర్చి రూ.20 వేలు, సింగిల్‌పట్టి రూ.40వేలు, దేశీ మిర్చి రూ.40వేలు, తాలు క్వింటాకు రూ. 12వేలు పలికింది. ఇటీవల చపాట మిర్చి ధరలు బాగా పెరిగాయి. నాలుగు సంవత్సరాల తరువాత దేశీ మిర్చి ధరలు పుంజుకుంటున్నాయి. 2021-22లో మిర్చి ధరలు, ముఖ్యంగా దేశీ మిర్చి ధర క్వింటాకు లక్ష రూపాయల వరకు పలికింది. ఆ తరువాత గడిచిన నాలుగేళ్లుగా రూ.30వేల నుంచి రూ.40వేలు.. తేజ, వండర్‌హాట్, యూఎస్ 341 లాంటి రకాలకు రూ.12వేల నుంచి రూ.16వేలు పలికాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. అనేక మంది రైతులు మిర్చి బస్తాలను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్నారు. ప్రస్తుత సీజన్‌లో కొంత కాలంగా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. జియోట్యాగింగ్ కలిగిన దేశీ మిర్చికి విదేశాలలో మంచి డిమాండ్ ఉండడంతో ఎగుమతులు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. కాగా, వరంగల్ వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం మిర్చి ధరలు గరిష్టంగా ఉన్నాయి. గత నెల మొదటి వారంలో మిర్చి సీజన్ ప్రారంభం కాగా, తొలుత క్వింటాకు రూ.16,300 నుంచి రూ.16,800 వరకే సగటు ధరలు ఉన్నాయి. మార్కెట్‌కు వరుస సెలవుల అనంతరం ఈనెల 18న సగటు ధర రూ.17,011ఉండగా క్రమంగా పెరుగుతూ తాజాగా రూ.18,489కి చేరింది. ఖమ్మం, వరంగల్ మార్కెట్ల రాబడులు, కోల్డ్ స్టోరేజీల్లో ఉన్న నిల్వలు, ఇతర దేశాల ఎగుమతుల అంశాలన్నీ ఇక్కడి మిర్చి ధరలను ప్రభావితం చేస్తున్నట్లు వ్యాపారులు విశ్లేషిస్తున్నారు.

# ప్రజలను ఏమార్చే పాలన

**రెండేళ్లుగా అదే చేస్తున్నారు**

**మరోమారు ప్రజలను మోసం చేసే యత్నం**

**గతంలో ఇచ్చిన దరఖాస్తులకే దిక్కులేదు**

**99 రోజుల ప్రజాపాలనపై మండిపడ్డ హరీష్ రావు**



**హైదరాబాద్,మార్చి6 :** గతంలో రెండుసార్లు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి తీసుకున్న లక్షలాది దరఖాస్తులు పరిష్కారం కాక ఇంకా చెత్తబుట్టల్లోనే మగ్గుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ దరఖాస్తులకు దిక్కు లేదు కానీ, మళ్లీ ఇప్పుడు పది వారాల పాటు పది రకాల నాటకాలతో ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం కావడం సిగ్గు చేటని అన్నారు. రెండున్నరేండ్లలో అసలు ఏం చేసారని ప్రచారం నిర్వహిస్తున్నారు. రేవంత్ రెడ్డి గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించి మీ పైఫల్యాలు ప్రచారం చెప్పుకుంటారా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికపై హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. యాక్షన్ ప్లాన్ పేరిట పాలనా వైఫల్యం నుంచి దృష్టి మరల్చేందుకు డైవర్షన్ ప్లాన్ డ్రామాకు తెర తీశారని ధ్వజమెత్తారు. ప్రచార కోసమేనని, ప్రజలకు ఒరిగేదేమి లేదని అన్నారు. 800 రోజుల పాలనలో చేసిందేం లేక, 99 రోజు ప్రణాళిక పేరిట రేవంత్ రెడ్డి మరో డ్రామాకు తెరతీసిందని ఆరోపించారు. రెండున్నరేండ్ల పాలన తర్వాత ప్రగతి ప్రణాళికలు గుర్తుకు వచ్చాయా? అంటూ నిలదీశారు. అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీలు, పాలన వైఫల్యాలు, కోట్లు కొల్లగొట్టేందుకు చేసిన స్కాంలు, ప్రజల ఛీత్కారాల నుంచి దృష్టి మరల్చేందుకు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మరో డైవర్షన్ ఎ÷–లాన్ అని విమర్శించారు. కోతల సమయం వచ్చినా ఈ సీజన్ ఇప్పటి వరకు రైతు భరోసా దిక్కు లేదు. గత సీజన్ పంట బోనస్ ఇవ్వక చేతులెత్తేసారు. చివరకు యూరియా కూడా సరఫరా చేయలేక రైతులను నడిరోడ్డు మీదకు ఈడ్చారు. నమ్మించి గొంతు కోసిన ఈ మోసాల గురించి రైతులకు వివరిస్తారా? చెప్పాలని డిమాండ్ చేశారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు అని ఊదరగొట్టి, అధికారంలోకి వచ్చాక యువతను మోసం చేశారు. జాబ్ క్యాలెండర్ జాబ్ లెస్ క్యాలెండర్ చేశారు. నోటిఫికేషన్లు ఇవ్వకుండా మూసీ బ్యూటిఫికేషన్ పేరిట లూటీకి తెగబడ్డారు. రాజీవ్ యువ వికాసం పేరిట తీసుకున్న దరఖాస్తులు దిక్కు లేకుండా పోయాయని హరీష్‌రావు విమర్శించారు. యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమం అంటూ కొత్త పాట పాడుతున్నారని దుయ్యబట్టారు .అందని గ్యారెంటీల కోసం ఎదురుచూస్తున్న లక్షల మంది బాధితుల సంగతేంటో చెప్పాలని,సోలార్ విద్యుత్, పర్యావరణం, డ్రగ్స్ అడ్డుకట్ట లాంటివన్నీ పత్రికల్లో పబ్లిసిటీ ఇచ్చుకునేందుకు పెట్టుకున్న పేర్లు తప్ప, ఇందులో ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. పాలన గాలికి వదిలి పబ్లిసిటీ పేరిట చేస్తున్న మీ గారడీలను ప్రజలు గమనిస్తున్నారని, దుర్మార్గ పాలనను నిలదీసేందుకు గ్రామ గ్రామాన ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు

# అసంపూర్తిగా అంబర్‌పేట ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు

**వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోండి**

**సిఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ**



**హైదరాబాద్,మార్చి6 :** అంబర్‌పేట ఫ్లై ఓవర్ కింద ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమైన జాతీయ రహదారుల నిర్మాణం విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న రూ. 1.85 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టుల కేటాయింపులు కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ అభివృద్ధి మీద ఉన్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమని పేర్కొన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు తెలంగాణలో 2,800 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. మరో 2,500 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. తద్వారా తెలంగాణలో నూతనంగా ఏర్పాటైన జిల్లాలతో కలిపి మొత్తం 33 జిల్లాలు కూడా తక్కువ సమయంలోనే జాతీయ రహదారులతో అనుసంధానించామని.. ఇది చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని, ప్రయాణ సమయాన్ని తగ్గించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ రూ.265 కోట్ల వ్యయంతో ఔఉ163 (గతంలో ఔఉ-202) మీద నగరంలోని అంబర్‌పేట క్రాస్ రోడ్డు వద్ద 1.5 కిలోమీటర్ల పొడవైన 4 వరుసల్ల ÷÷-ల ఓవర్‌ను నిర్మించిందని గుర్తుచేశారు. 5 మే, 2025 నాడు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ ఫ్లై ఓవర్‌ను ఘనంగా ప్రారంభించారని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తనతోపాటుగా తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొన్నారని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. ఈ÷÷-ల ఓవర్‌కు అవసరమైన భూసేకరణ పూర్తి కాలేదని అన్నారు. దీని నిర్మాణం జరిగి, ప్రారంభోత్సవం కూడా పూర్తి చేసుకున్నప్పటికీ దీని కింద ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణం మాత్రం పూర్తిస్థాయిలో జరగలేదని తెలిపారు. భూసేకరణ విషయంలో కొన్ని శక్తులు అడ్డుతగులుతోండటంతో అనవసరంగా తీవ్ర జాప్యం జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇది 2018లో మంజూరయినప్పటికీ లేని సమస్యలు సృష్టించి భూసేకరణ పూర్తి కాకుండా కుట్రలు చేసి సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తిస్థాయిలో జరగనివ్వకపోవడంతో ఈ రహదారి వెంట ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అప్పటి సీఎం కె. చంద్రశేఖరరావు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి అనేకసార్లు తెలియజేశానని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణ మంత్రులకు స్వయంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా అనేకసార్లు తెలియజేశారని అన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్, ఇతర సంబంధిత అధికారుల దృష్టికి తాను కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లి అనేకసార్లు మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేసినప్పటికీ, ఈ సమస్య ఓ కొలిక్కి రాలేదని చెప్పుకొచ్చారు. భూసేకరణకు సంబంధించిన భూమికి రూ. 2.54 కోట్ల పరిహారం లబ్దిదారులకు ప్రభుత్వం చెల్లించినప్పటికీ మధ్య దళారులు అడ్డుకుంటున్నారని అన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా చొరవ చూపించి, సర్వీసు రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సంబంధిత జీహెచ్ఎంసీ, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ అధికారుల ద్వారా తగిన చర్యలు తీసుకొని సర్వీస్ రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించటానికి సహకరించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు.

# శ్రీవారిని దర్శించుకున్న కవిత దంపతులు

**మనోవేదనకు తెరపడిందని ఆనందం**

**తిరుమల,మార్చి6 :** నాలుగేళ్లుగా తాను పడుతున్న మనోవేదన వేంకటేశ్వరస్వామి దయతో తీరిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. తిరుమల శ్రీవారిని ఆమె దర్శించుకున్నారు. తన భర్తతో కలిసి శుక్రవారం వేకువజామున శ్రీవారి అభిషేక సేవలో పాల్గొన్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వారికి ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ఢిల్లీ మద్యం కేసులో కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో శ్రీవారికి మొక్కులు చెల్లించేందుకు కాలినడకన వచ్చానన్నారు. త్వరలో తెలంగాణలో రాజకీయ పార్టీ స్థాపించనున్నట్లు వెల్లడించారు. తనకు కష్టకాలంలో సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. స్వామి దయ తనపై ఉండడం వల్లనే కేసు నుంచి బయటపడ్డానని అన్నారు.



# ఆర్ అండ్ బి శాఖలో తనిఖీలు

**మొదటి రోజు కార్యక్రమంలో సిఎస్ వికాస్ రాజ్**

**హైదరాబాద్,మార్చి6 :** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం భాగంగా మొదటి రోజు రాష్ట్ర రోడ్ల భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ అదనపు కార్యదర్శులతో కలిసి శుక్రవారం టి.ఆర్ / బి సెక్షన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పాత రికార్డులను సక్రమంగా సర్దుబాటు చేసి, అవసరమైన చర్యలు తీసుకొని,క్లోజ్ చేయాల్సిన ÷ళ్లైను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. తదుపరి స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ రెడ్ హిల్స్‌లో ఉన్న ఆర్ / బి శాఖ భవనంలో సెంట్రల్ బిల్డింగ్ డివిజన్తో పాటు అక్కడ ఉన్న ఇతర కార్యాలయాలను కూడా సందర్శించారు. అధికారులు, సిబ్బంది కలిసి కార్యాలయ ప్రాంగణం, రికార్డు గదులు మరియు అందులో ఉన్న÷ళ్లైను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టాలనీ,ఈనెల 15 వరకు పూర్తి చేయాలన్నారు. ముందుగా ఎక్కువకాలంగా పెండింగ్‌లో ఉన్న÷ళ్లైను గుర్తించి ప్రతిరోజూ టా÷–గ్గ÷ట్ పెట్టుకొని పనిచేయాలన్నారు. ఎస్టాబ్లిష్‌మెంట్, విజిలెన్స్, డిసిప్లినరీ కేసులు, క్వాలిటీ కంట్రోల్ రికవరీలు, కోర్టు కేసులు వంటి పాత ÷ళ్లైను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలనీ,కార్యాలయ నిబంధనల ప్రకారం పాత రికార్డులను తొలగించాలన్నారు. ముఖ్యంగా 2014 కంటే ముందు ఉన్న÷ళ్లైను అవసరమైతే స్కాన్ చేసిన డిజిటల్ రికార్డుల నుంచి ప్రింట్లు తీసుకుని ఇండెక్సింగ్ చేయాలనీ సూచించారు.

# అయోధ్యలో అమితాబ్ భూమి కొనుగోలు

అయోధ్య,మార్చి6: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రముఖ ఆధ్యాత్మిక నగరం అయోధ్యలో బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ భారీ పెట్టుబడి పెట్టారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ హౌస్ ఆఫ్ అభినందన్ లోధా నుంచి రూ.35 కోట్లతో 2.67 ఎకరాల విస్తీర్ణం కలిగిన స్థలాన్ని కొనుగోలు చేశారు. సంబంధిత లావాదేవీని శుక్రవారం పూర్తి చేసినట్లు లోధా సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. అయోధ్యలో అమితాబ్ ఇప్పటికే పలు పెట్టుబడులు పెట్టారు. ఒక్క లోధా ప్రాజెక్ట్‌ల్లో మూడు చోట్ల, మొత్తంగా అయోధ్యలో నాలుగు చోట్ల పెట్టుబడులు పెట్టారు. అయోధ్య రామ మందిరానికి దగ్గర్లో లోధా సంస్థ అభివృద్ధి చేసిన సరయు ప్రాజెక్ట్‌లో 2024 జనవరిలో అమితాబ్ తొలుత స్థలం కొనుగోలు చేశారు. ఈ ప్రాజెక్ట్‌కు దగ్గర్లోనే తాజాగా మరో స్థలాన్ని అమితాబ్ తాజాగా కొన్నారు. ఇది కాకుండా 10,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒక ప్లాట్‌ను లోధా నుంచి గతంలో కొనుగోలు చేశారు. అమితాబ్ బచ్చన్ పెట్టుబడుల వెనుక దీర్ఘకాలిక వ్యూహం, అయోధ్యపై ఉన్న ఆయకున్న విశ్వాసాన్ని తెలియజేస్తున్నాయని లోధా గ్రూప్ ఛైర్మన్ అభినందన్ లోధా పేర్కొంది. దేశంలో అతిపెద్ద ల్యాండ్ డెవలపర్‌గా ఉన్న హౌస్ ఆఫ్ లోధా.. ఇప్పటికే పలు నగరాల్లో సేవలందిస్తోంది. దేశవ్యాప్తంగా 48 నగరాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.



# కేసీఆర్‌ను కలిసిన బాల్క సుమన్

**హైదరాబాద్,మార్చి6 :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ శుక్రవారం కలిశారు. ఇటీవల క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులో అరెస్టై జైలుకు వెళ్లి వచ్చిన బాల్క సుమన్ తొలిసారి కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎన్నికల్లో ఎంతో ధైర్యంగా , సమర్ధవంతంగా పనిచేసి మెజారిటీ సభ్యులను గెలిపించు కున్నందుకు, కాంగ్రెస్ దౌర్జన్యాలను తిప్పికొట్టినందుకు బాల్కసుమన్‌ను అభినందించారు. మున్సిపల్ ఎన్నికలు జరిగి నెలరోజులు కావస్తున్నా క్యాతన్‌పల్లి మున్సిపల్ పాలకవర్గం ఎన్నికకు కాంగ్రెస్ అడ్డం పడుతుంది. మెజారిటీ లేకున్నా బలప్రయోగం, బెదిరింపులతో హస్తగతం చేసుకోవాలని నానా ప్రయత్నాలు చేస్తుంది. ఇందులో భాగంగా క్యాతన్‌పల్లి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ , సీపీఐ అభ్యర్థులు 14 మంది గెలుపొందారు. ఇక సమావేశంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక లాంఛనమే అన్న తరుణంలో కాంగ్రెస్‌కు చెందిన నాయకులు, మంత్రి వివేక్ ,ఎంపీ పోలీసుల సహకారంతో అడ్డుపడుతూ వచ్చారు. చివరకు చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైలులు పెట్టారు.సుమారు 16 రోజుల పాటు బెయిల్ దొరకకుండా అడ్డుపడ్డారు. రెండు రోజుల క్రితం జైలు నుంచి బయటకు వచ్చిన బాల్కసుమన్ నిన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కెసిఆర్‌ను కలిసి తాజా పరిణామాలను బాల్క వివరించారు.

**నాచారం బ్రహ్మోత్సవాలకు కేసీఆర్‌కు ఆహ్వానం**

బీఆర్ఎస్ అధినేత , మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను నాచారం గుట్ట శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం ప్రతినిధులు కలిశారు. ఈ నెల 8 నుంచి 19 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ శుక్రవారం ఆహ్వాన పత్రికను , స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భగా ఆలయ అర్చకులు కేసీఆర్‌ను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రవీందర్ , ఈవో రంగాచారి , అర్చకులు పాల్గొన్నారు.

# సివిల్స్‌లో మెరిసిన ఉమ్మడి వరంగల్ యువత

**పలు ర్యాంకులు కొట్టేసిన విద్యార్థులు**

**వరంగల్,మార్చి 6 :** కష్టపడితే ఏదైనా సాధించవచ్చని ఉమ్మడి వరంగల్ జిల్లా యువకులు నిరూపించారు. దేశంలోనే అత్యున్నత సర్వీస్ అయిన యూపీఎస్సీ ఫలితాల్లో ర్యాంకులు పొందారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి పుట్టెడు దుఃఖాన్నిగుండెల్లో దాచుకొని నానమ్మ పారిశుద్ధ్య కష్టాన్ని కండ్లారా చూసి ఎదిగిన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలానికి చెందిన దైనంపల్లి ప్రవీణ్ తన కృషి, పట్టుదలతో సివిల్స్ ఫలితాల్లో 793వ ర్యాంక్ సాధించి ములుగు జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. గ్రూప్-1 పరీక్షల్లో 105వ ర్యాంక్ సాధించి డీఎస్పీగా ఎంపికైన ప్రవీణ్, డీఎస్పీ శిక్షణ పొందుతూనే తాజాగా విడుదలైన యూపీఎస్సీలో ర్యాంక్‌ను సాధించి అందరికి ఆదర్శంగా నిలిచాడు. హనుమకొండ జిల్లా న్యూశాయంపేటకు చెందిన గుండు అఖిలేష్ ఆల్ ఇండియా సర్వీస్ ఐపీఎస్ 464 ర్యాంకును సాధించి ప్రతిభను చాటాడు. అఖిలేష్ తండ్రి భూపాలపల్లిలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ విధులు నిర్వహిస్తున్నారు. తల్లి సరస్వతి గృహిణిగా ఇంటి బాధ్యతలను నిర్వహిస్తోంది. అఖిలేష్ 2013లో హనుమకొండ హంటర్ రోడ్డులోని వరంగల్ పబ్లిక్ స్కూల్లో పదో తరగతిలో ఉత్తమ ర్యాంకును సాధించాడు. అఖిలేష్ యూపీఎస్సీలో విజయం సాధించడం పట్ల తల్లింద్రులు, స్థానికులు హర్షం వెలిబుచ్చారు. కాజీపేట పట్టణం 61 వ డివిజన్ ప్రశాంత్ నగర్ ఫేస్ 3లో నివాసం ఉంటున్న అట్లా తరుణ్ తేజ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫలితాలలో 123వ ర్యాంకు తో సత్తా చాటారు. కుమారుడు సివిల్ సర్వీస్‌లో మెరుగైన ర్యాంక్ సాధించడం పట్ల తల్లిదండ్రులు అట్ల రవీందర్- అమరావతి సంతోషం వ్యక్తం చేశారు.

# మహిళను వేధించిన కేసులో 18నెలల జైలు

**ఖమ్మం,మార్చి6 :** మహిళను వేధించిన కేసులో దోషిగా తేలిన వ్యక్తికి న్యాయస్థానం 18 నెలల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించింది. కేసు వివరాలు ఇలావున్నాయి.. 2019లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు 24 ఏరియాకు చెందిన ఏర్పుల కృష్ణ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవిస్తున్నాడు. అదే ఏరియాలో ఉన్న ఓ మహిళను తరచూ వేధింపులకు గురి చేయడంతో ఆ మహిళ ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేసి నివేదికను కోర్టుకు సరెండర్ చేశారు. విచారణలో కృష్ణ దోషిగా తేలడంతో జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు జడ్జి డి.చంద్రిక రెడ్డి తీర్పు వెలువరించారు. ఈ కేసులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సింగు అనిల్ కుమార్ ప్రాసిక్యూషన్ తరపున వాదించగా, సిడిఓ సురేశ్, రాఘవయ్య, హెచ్ సి అనంత రాములు సహకరించారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

**వనపర్తి,మార్చి6 :** వనపర్తి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఏదుల మండల కేంద్రం సమీపంలో ఓ ఆటో ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారిని వెంకటయ్య (50), సుమిత్ర (42)గా గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు వనపర్తి జిల్లా పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. గాయపడిన వారిని సమీప ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనతో స్థానిక ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.



# 9నుంచి పార్లమెంట్ రెండోదశ సమావేశాలు

## ఈ సమావేశాల్లోనే స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాసం

## ఎంపిలకు విప్ జారీ చేసిన బిజెపి, కాంగ్రెస్ పార్టీలు

**న్యూఢిల్లీ,మార్చి6 :** కేంద్ర బ్జడెట్‌పై రెండో దశ సమావేశాలు ఈ నెల 9 నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి దశ సమావేశాలు అర్ధాంతరంగా వాయిదాపడ్డాయి. సభలో నెలకొన్న గందరగోళం నేపథ్యంలో సమావేశాల్ని వాయిదా వేశారు. రెండో దశ బ్జడెట్ సమావేశాల్లోనే ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెడతారు. తర్వాత దీనిపై చర్చ, ఓటింగ్ ఉంటాయి. ఈ పక్రియ ప్రారంభమయ్యే వరకు స్పీకర్ చైర్‌లో ఓం బిర్లానే ఉంటారు. సోమవారం ప్రారంభం కానున్న చర్చ సమయంలో మాత్రం ఆయన సాధారణ ఎంపీలాగే సభలో కూర్చుంటారు. పార్లమెంట్ నిబంధనల ప్రకారం ఒక ఎంపీగా.. తన స్పీకర్ పదవిని రక్షిస్తూ మాట్లాడే అవకాశం కూడా ఉంటుంది. తాజా సమావేశాలు ఏప్రిల్ 2 వరకు జరుగుతాయి. వచ్చే వారం లోక్‌సభలో స్పీకర్‌పై కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానం పెట్టబోతుంది. ఈ నేపథ్యంలో ఈ తీర్మానంపై ఉత్కంఠ నెలకొంది. అందుకే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి. ప్రతి ఒక్కరూ సభలో చర్చ, ఓటింగ్ సందర్భంగా అందుబాటులో ఉండాలని ఆదేశించాయి. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను పదవి నుంచి తొలగించాలని కోరుతూ గత నెలలోనే కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానానికి నోటీస్ ఇచ్చాయి. దీనిపై ఈనెల 9, 10 తేదీల్లో చర్చ, అనంతరం ఓటింగ్ జరగనుంది. అందువల్ల ఈ రెండు రోజుల్లో తమ ఎంపీలు అందరూ సభకు హాజరవ్వాలని, అందుబాటులో ఉండాలని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి. ఈ మేరకు తమ ఎంపీలు సభలో ఉండి, ప్రభుత్వానికి మద్దతు తెలపాలని బీజేపీ సూచించింది. స్పీకర్ ఓంబిర్లా పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని కోరుతూ గత నెలలో ప్రతిపక్షాలకు చెందిన 118 మంది ఎంపీలు సంతకాలు చేసి, నోటీసులు ఇచ్చారు. అయితే, నోటీసు ఇచ్చిన తర్వాత నుంచి సభ వాయిదా పడి కార్యకలాపాలు నిలిచిపోయాయి.

# సివిల్స్ ఫలితాలు విడుదల

## సత్తా చాటిన తెలుగు అభ్యర్థులు

## అనూజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్

**న్యూఢిల్లీ,మార్చి6 :** సివిల్స్ పరీక్ష ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుక్రవారం విడుదల చేసింది. ఈ పరీక్షల్లో అనూజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించారు. రాజేశ్వరి సువే రెండో స్థానంలో నిలిచారు. ఆకాన్ష్ ధుల్ మూడో ర్యాంక్ పొందారు. రాఘవ్ ఝున్‌ఝున్ వాలా నాలుగో ర్యాంక్ సాధించారు. ఈ పరీక్షల్లో తెలుగు రాష్ట్రాల్లోని అభ్యర్థులు సత్తా చాటారు. సృజన (55వ ర్యాంక్), డీఎస్‌కే ప్రచేత్ (193వ ర్యాంక్), ఎస్. వర్షిత్‌రెడ్డి (259వ ర్యాంక్), ఎం.పవన్‌కుమార్‌రెడ్డి (297వ ర్యాంక్), వి. విక్రమసింహారెడ్డి (541వ ర్యాంక్), గుమ్మల శ్వేత (573వ ర్యాంక్), పోతుపురెడ్డి భార్గవ్ (537వ ర్యాంక్), పుదారి రాహుల్ (748వ ర్యాంక్), కత్తిమాని అనిరుధ్ (786వ ర్యాంక్), కోరపాతుల శ్రీకర్‌రాజు (806వ ర్యాంక్), ఇస్లావత్ శ్రీరామ్ హర్ష (823 ర్యాంక్), కట్టా ప్రత్యూష (908వ ర్యాంక్), గోగుల రాజశేఖర్ (920వ ర్యాంక్), గుగులోతు జితేందర్ నాయక్ (939వ ర్యాంక్) సాధించారు. ఈ పరీక్షా ఫలితాలు విడుదలైన 15 రోజుల్లో వెబ్ సైట్‌లో మార్కులు అప్ లోడ్ చేస్తామని యూపీఎస్సీ ప్రకటించింది. మరిన్ని వివరాలు కోసం ఈ ఫోన్ నెంబర్లు.. 23385271, 23381125, 23098543 సంప్రదించాలని ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సూచించింది. ఉదయం 10 నుంచి 05.00 గంటల మధ్య సంప్రదించాలని యూపీఎస్సీ స్పష్టం చేసింది. గతేడాది అంటే.. 2025లో ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి ఆగస్ట్, సెప్టెంబర్‌లో మెయిన్స్ పరీక్షలు చేపట్టారు. వాటిలో అర్హత పొందిన వారికి ఈ ఏడాది ఫిబ్రవరిలో మౌఖిక పరీక్ష నిర్వహించారు. ఈ చివరి వడపోతలో మొత్తం 1087 మంది అభ్యర్థులు సివిల్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్‌తో పాటు గ్రూప్ ఎ, గ్రూప్ బిలో వివిధ సెంట్రల్ సర్వీస్‌లో వీరంతా చేరనున్నారు.

# అసోంలో కూలిన సుఖోయ్ యుద్ధవిమానం

## ఇదదరు పైలట్లు దుర్మరణం

## ఒకరు ఆపరేషన్ సిందూర్ పైలట్ పూర్వేశ్ దురాగ్కర్

**న్యూఢిల్లీ,మార్చి6 :** అస్సాంలోని కర్బీ ఆంగ్లాంగ్‌లో భారత వైమానిక దళానికి చెందిన స-ఖోయ్ జెట్ కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు చనిపోగా.. వారిలో ఒకరైన ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్ దురాగ్కర్ ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నట్లుగా సమాచారం. ఈ విషయాన్ని పూర్వేష్ తల్లిదండ్రులు మీడియాకు తెలిపారు. పూర్వేష్(28).. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నట్లు అతని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ముందుగా ఈ విషయం తమకు తెలియదని.. ఆపరేషన్ సిందూర్ ముగిసిన 15 రోజుల తరువాత తెలిసిందని పూర్వేష్ తండ్రి రవీంద్ర దురాగ్కర్ తెలిపారు. యుద్ధ సమయంలో పూర్వేష్ వద్ద ఫోన్ లేదని.. యుద్ధం ముగిసిన తరువాత పూర్వేష్ తమకు కాల్ చేసి విషయం చెప్పాడని రవీంద్ర తెలిపారు. అస్సాంలో ప్రమాదం జరగడానికి ఒక రోజు ముందు తన కొడుకుతో మాట్లాడినట్లు రవీంద్ర తెలిపారు. ఇంతలోనే ఇలా జరిగిందంటూ కన్నీరమున్నీరయ్యారు. తన కొడుకు భారత వైమానిక దళంలో భాగమైనందుకు చాలా గర్వంగా ఉందన్నారు. పూర్వేష్ ఎప్పుడు మాట్లాడినా యుద్ధ విమానాలను నడిపిన తన అనుభవాన్ని, ఐఏఎఫ్ జెట్‌ల వేగం గురించి ఎంతో ఆసక్తిగా చెబుతుండేవాడని.. తన సహోద్యోగులను ఎంతో గౌరవించేవాడని రవీంద్ర తెలిపారు. 'నా కొడుకు దేశ సేవలో తనను తాను త్యాగం చేసుకున్నాడు. పూర్వేష్ తన కలను నెరవేర్చుకున్నాడు. కానీ, తను కోరుకున్నంతగా దేశానికి సేవ చేయలేకపోయాడు. కేవలం 4 సంవత్సరాలు మాత్రమే పని చేశాడు. పది రోజుల క్రితం మా ఇంటికి వచ్చాడు. తిరిగి విధుల్లోకి చేరిన తరువాత ఇలా జరిగింది.' అంటూ రవీంద్ర విలపించారు. ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్, స్క్వాడ్రన్ లీడర్ అనుజ్ శిక్షణా మిషన్‌లో ఉన్నారు. జోర్హాట్ వైమానిక స్థావరం నుండి వీరి జెట్ టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కనిపించకుండా పోయింది. సాయంత్రం 7:42 గంటలకు సుఖోయ్‌తో కమ్యూనికేషన్ కోల్పోయినట్లు తెలిపిన అధికారులు.. జోర్హాట్ వైమానిక స్థావరం నుంచి 60 కిలోమీటర్ల దూరంలో కూలిపోయినట్లు గుర్తించారు.

# ఇజ్రాయిల్‌పై తీవ్రమైన ఇరాన్ ప్రతిదాడులు

## డిమోనా అణు కేంద్రంపై దాడికి ఇరాన్ గురి



**టెహ్రాన్,మార్చి6 :** ఇజ్రాయిల్ దాడులకు ప్రతిదాడులను ముమ్మరం చేసిన ఇరాన్ ఇజ్రాయెల్ అణు రియాక్టర్‌పై గురిపెట్టిందన్న వార్తలు వస్తున్నాయి. ఇజ్రాయిల్ అణు కేంద్రాన్ని ధ్వంసం చేస్తామని ప్రకటించింది. ఇజ్రాయెల్ తన అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను డిమోనాకు రక్షణగా మోహరించింది. ప్రపంచంలోనే అత్యంత దుర్భేద్యమైన ప్రదేశంగా మార్చేసింది. ఇక్కడ యారో-2, 3, డేవిడ్ స్లింగ్ వంటి క్షిపణి రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. ఇటీవల తన అత్యాధునిక ఐరన్ బీమ్‌ను కూడా ఇక్కడికే తరలించినట్లు కథనాలు వెలువడ్డాయి. అంతేకాదు.. భూగర్భంలో కొన్ని అంతస్తుల కింద తన అణు కార్యక్రమాన్ని ఇజ్రాయెల్ సురక్షితంగా ఉంచినట్లు తెలుస్తోంది. డిమోనాపై దాడి చేయడానికి ఇరాన్ అమ్ములపొదిలో డ్రోన్లు, క్షిపణులు వంటి చాలారకాల ఆయుధాలు ఉన్నాయి. రియాక్టర్ నుంచి ఇరాన్ 1200-1500 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇంత దూరం ప్రయాణించేందుకు టెహ్రాన్ అమ్ముల పొదిలో షహీన్ 136 డ్రోన్లు భారీ సంఖ్యలో ఉన్నాయి. ఇది దాదాపు 50 కిలోల పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలదు. ఇక క్షిపణుల విషయానికి వస్తే సాహబ్-3, ఖైబర్‌షేకన్, ఎమాద్, ఖుర్రంషహర్, ఘద్ర, సెజ్జిల్, సుమర్ వంటి క్షిపణులున్నాయి. వీటి రేంజి 1300 కిలోమీటర్ల నుంచి 2500 కిలోమీటర్ల వరకు ఉంది. ఇవికాకుండా ఫతా-2 హైపర్ సోనిక్ క్షిపణి కూడా ఉంది. ఇది ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థలను కూడా తప్పించుకోగలదు. గతంలో సిరియాతో ఘర్షణ వేళ ఈ రియాక్టర్ సమీపంలో కొన్ని క్షిపణులు పడ్డాయి. ఇజ్రాయెల్ ఏర్పడిన తర్వాత పొరుగు దేశాలు వరుసగా దానితో యుద్ధాలకు దిగాయి. అమెరికా సాయంతో.. వాటిని ఓడించినా.. ఎప్పటికైనా తన ఉనికికి ముప్పు తప్పదని గ్రహించింది. దీంతో నాటి ప్రధాని డేవిడ్ బెన్ గురియన్ తమ దేశాన్ని అణుశక్తిగా మార్చాలనే నిర్ణయానికి వచ్చారు. ఫ్రాన్స్ సాయంతో అణు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు నెగెవ్ ఎడారిలో 'డిమోనా' అనే ప్రదేశంలో ఓ భారీ రియాక్టర్‌ను ఇజ్రాయెల్ నిర్మించింది. ఐరోపా దేశాల టెక్నాలజీ, బ్లూప్రింట్స్, నిపుణుల సాయంతో దీనిని రూపొందించారు. ఇందులోని భూగర్భ బంకర్లలో అణుబాంబులకు వాడే ప్లుటోనియం ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. ఈ విషయం అతికొద్దిమందికి మాత్రమే తెలుసు. అలా ఇజ్రాయెల్ అణ్వాయుధం తయారీలో డిమోనా రియాక్టర్ కీలక పాత్ర పోషించింది. ఈ రియాక్టర్‌కు ఉత్తరం వైపు 85 కిలోమీటర్ల దూరంలో జెరూసలెం నగరం ఉంది. ఇక 75 కిలోమీటర్ల దూరంలో ఈజిప్ట్ సరిహద్దులు.. 25 కిలోమీటర్ల దూరంలో జోర్డాన్ ఉన్నాయి. ఒకవేళ దాడి జరిగితే ఇక్కడి నుంచి లీకయ్యే రేడియేషన్ ప్రభావం ఈ దేశాలకు కూడా పాకే ప్రమాదం ఉంది.

# యుద్ధం నుంచి వెనక్కి తగ్గబోం

## అసలు యుద్ధం మొదలయ్యిందే ఇప్పుడు

## అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ స్పష్టం



**వాషింగ్టన్,మార్చి6 :** ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం నుంచి వెనక్కి తగ్గేదే లేదని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ స్పష్టం చేశారు. అమెరికా సైనిక శక్తిని ఇరాన్ తక్కువ అంచనా వేస్తోందన్నారు. ఈ యుద్ధంలో అమెరికా నిలబడలేదని ఇరాన్ అనుకుంటోందని, తాము అసలు పోరాటాన్ని ఇప్పుడే మొదలుపెట్టామని ఆయన పేర్కొన్నారు. ఇక గల్ఫ్ ప్రాంత సముద్ర జలాల్లో అమెరికా నౌకా దళాలు వెనక్కి జరుగుతున్నాయనే ప్రచారాన్ని యూఎస్ సెంట్రల్ కమాండ్ ఖండించింది. యావత్ ఇరాన్ నేవీని సముద్రంలో ముంచేసే వరకు తమ మిషన్ ఆగదని తేల్చి చెప్పింది. గత 72 గంటల్లో ఇరాన్‌లోని దాదాపు 200 లక్ష్యాలపై అమెరికా బాంబర్ ఫోర్స్ వైమానిక దాడులు చేసిందని సెంట్‌కామ్ వెల్లడించింది. బి-2 స్పిరిట్ బాంబర్ విమానాల నుంచి కేవలం ఒక గంట వ్యవధిలోనే 2వేల పౌండ్ల బరువున్న డజన్ల కొద్దీ పెనెట్రేటర్ బాంబులను బాలిస్టిక్ మిస్సైల్ లాంచ్ ప్యాడ్లపై వేశామని పేర్కొంది. అమెరికా సంకల్పం ఎంత బలమైందో ఇరాన్ అర్థం చేసుకోలేకపోతోందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ అన్నారు. ఇరాన్‌పై తమ సైనిక చర్యను బలంగా కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. వాషింగ్టన్‌లో విలేకరుల సమావేశం వేదికగా పీట్ హెగ్సెథ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికాను ఇరాన్ నేతలు, ఐఆర్‌జీసీ తక్కువ అంచనా వేస్తున్నాయని ఆయన చెప్పారు. తమ సంకల్పానికి కట్టుబడి ఉంటామని, ఇరాన్‌పై పోరాటాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. పూర్తి శక్తితో అమెరికా ఇప్పుడే దాడులను మొదలుపెట్టిందన్నారు. ఒకవేళ అవసరమైతే దీర్ఘకాలం పాటు ఈ యుద్ధాన్ని చేసేందుకూ అమెరికా సన్నద్ధమై ఉందని పేర్కొన్నారు. ఇరాన్ దాడుల నేపథ్యంలో అరబ్ దేశాల నుంచి అమెరికాకు శరణార్థులు క్యూ కట్టే ఛాన్స్ ఉందనే ప్రచారం జరుగుతోంది. అయితే అరబ్ శరణార్థులకు అమెరికాలో ఆశ్రయాన్ని కల్పించే ఎలాంటి ప్రణాళికలూ ప్రస్తుతానికి తమకు లేవని అమెరికా రక్షణ మంత్రి తేల్చి చెప్పారు.

# ఇరాన్ యుద్ధంతో భారత్ ఎగుమతులకు అంతరాయం

## ఇరాన్‌కు నిలిచి పోయిన బాస్మతి బియ్యం

**న్యూఢిల్లీ,మార్చి6 :** ఇరాన్ యుద్ధం ప్రభావం ప్రపంచంపై తీవ్రంగా పడుతోంది. ముఖ్యంగా ఇండియాపై దీని ప్రభావాన్ని కాదనలేం. చమురు విషయంలో దేశానికి వచ్చిన ఇబ్బంది ఏమీ లేదు. కానీ, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు మాత్రం నిలిచిపోయాయి. ముఖ్యంగా ఇండియాలో పండే బాస్మతి బియ్యం ఎగుమతి ఆగిపోయింది. రవాణా జరిగే హోర్ముజ్ జలసంధిపై ఆంక్షలు, పలు నౌకలు నిలిచిపోవడం వల్ల బాస్మతి బియ్యాన్ని ఎగుమతి చేయడం లేదు. వ్యాపారవర్గాల తాజా అంచనా ప్రకారం మొత్తం 4 లక్షల టన్నుల బాస్మతి బియ్యం ఎగుమతులు నిలిచిపోయాయి. ఇందులో కొంత మార్గ మధ్యలో నౌకల్లో నిలిచిపోగా, ఇంకొంత పోర్టుల్లో, గోడౌన్లలో నిలిచిపోయింది. దీంతో వ్యాపారులు, రైతులు, మిల్లర్లు ఇబ్బందులు పడుతున్నారు. బాస్మతి బియ్యం ఎగుమతుల్లో ఇండియాది అగ్రస్థానం. అందులోనూ మనం పండించే బాస్మతి బియ్యం ఎక్కువగా ఇరాన్ సహా సౌదీ అరేబియా, ఇరాక్, యూఏఈ వంటి గల్ఫ్, మిడిల్ ఈస్ట్ దేశాలకే వెళ్తుంది. మన దేశంలోని 50 శాతం ఎగుమతులు ఈ దేశాలకు ఎగుమతి అవుతాయి. అలాంటిది ఇప్పుడు ఈ దేశాలు యుద్ధ సంక్షోభంలో చిక్కుకోవడంతో ఎగుమతులపై ప్రభావం పడుతోంది. అంతర్జాతీయంగా రవాణా నిలిచిపోవడంతో దేశీయంగా బాస్మతి ధరలు తగ్గుతున్నాయి. క్వింటాల్‌కు సగటున రూ.1,000 వరకు ఇండియాలో ధరలు తగ్గుతున్నట్లు వ్యాపారవర్గాలు తెలిపాయి. ముఖ్యంగా మధ్యప్రదేశ్‌పై ఈ ప్రభావం ఎక్కువగా ఉందని అంటున్నారు. మన దేశం నుంచి రవాణా అయ్యే ఇతర ఉత్పత్తులపై కూడా ఇదే తరహా ప్రభావం ఉంది. మధ్యప్రదేశ్‌లోని అరుదైన బర్వాని రకం అరటి ఎగుమతులు కూడా ఆగిపోయాయి. ఈ సంక్షోభం నివారణ అయితే, తిరిగి వ్యాపారం పుంజుకుంటుందని రైతులు, వ్యాపారులు ఆశిస్తున్నారు.

# అమెరికా ఆస్తులపైనే మా దాడులు

## అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు

## ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే

**న్యూఢిల్లీ,మార్చి6 :** పశ్చిమాసియాలోని అమెరికా ఆస్తులపై మాత్రమే తాము దాడులు చేస్తున్నామని ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే వెల్లడించారు. తమ దాడుల వల్ల పొరుగున ఉన్న అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదన్నారు. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో తన దేశం చేపడుతున్న చర్యలను ఆయన సమర్థించారు. యూఎస్ ఆస్తులనే మేం లక్ష్యంగా చేసుకుంటున్నాం. అందుకే మా దాడుల వల్ల అరబ్ దేశాల్లో ప్రాణనష్టం సంభవించలేదని ఖతీబ్జాదే అన్నారు. అలాగే ఇటీవల హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌక ఐరిస్ దేనా-75ను యూఎస్ ముంచేసిన సంగతి తెలిసిందే. భారత స్నేహితుల ఆహ్వానం మేరకు ఆ నౌక ఇక్కడికి వచ్చింది. దానిపై అమెరికా దాడి దురదృష్టకరం అని వ్యాఖ్యానించారు. అలాగే దిల్లీ పర్యటనలో భాగంగా ఆయన భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో ఖమేనీ సహా పాలనావర్గానికి చెందిన పలువురు ఉన్నతస్థాయి వ్యక్తులు చనిపోయారు. వారి మృతితో ఇరాన్ రాజకీయ వ్యవస్థ కూలిపోతుందని ట్రంప్ ప్రభుత్వం వ్యాఖ్యలు చేస్తోంది. వాటిని ఖతీబ్జాదే తోసిపుచ్చారు. తమ దేశ పాలనా నిర్మాణం వ్యక్తులపై కాకుండా వ్యవస్థలపై ఆధారపడి ఉందని స్పష్టంచేశారు. 'ఇరాన్‌లో రాజ్యాంగం ఉంది. ఎవరెవరు ఏఏ బాధ్యతలు నిర్వహించాలనే దానిపై స్పష్టమైన విభజన ఉంది' అని అన్నారు.

# పశ్చిమాసియా యుద్ధంలో బాలలు బలి

## 200 మంది వరకు చనిపోయినట్లు యూనిసెఫ్ ప్రకటన

**న్యూఢిల్లీ,మార్చి6 :** అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ దాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. యుద్ధం కారణంగా ఎంతోమంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. వారిలో చిన్నారులు కూడా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. యుద్ధం మొదలైన నాటినుంచి దాదాపు 200 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని తాజాగా యునిసెఫ్ పేర్కొంది. ఇందులో అత్యధికంగా ఇరాన్‌లో 181 మంది మరణించినట్లు వెల్లడించింది. లెబనాన్‌లో (7), ఇజ్రాయెల్ (3), కువైట్(1)లో మృతి చెందినట్లు తెలిపింది. యుద్ధాలు పిల్లలు ప్రారంభించరు.. కానీ, మూల్యం మాత్రం చెల్లిస్తున్నారు అని వ్యాఖ్యానించింది. పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు ఇప్పటికే చిన్నారులపై ఆందోళనకర ప్రభావాన్ని చూపిందని పేర్కొంది. ఇదిలాఉండగా.. అమెరికా- ఇజ్రాయెల్ తొలిరోజు ఆపరేషన్‌లో ఇరాన్‌లోని మినాబ్‌లో ఉన్న ఓ బాలికల పాఠశాలపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 160 మందికి పైగా విద్యార్థినులు ప్రాణాలు కోల్పోయారని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ తెలిపింది. ఈ దాడిపై తాజాగా యూఎస్ దళాలు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు యూఎస్ అధికారులు పేర్కొన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.



# సినిమాలతో పాటు పెట్టుబడుల్లోనూ
# నయన్ సూపర్ స్ట్రాటజీ

సౌత్ సినీ ఇండస్ట్రీలో మోస్ట్ సక్సెస్‌ఫుల్ హీరోయిన్లలో ఒకరైన నయనతార కేవలం సినిమాల్లోనే కాదు, పెట్టుబడుల విషయంలో కూడా ఎంతో వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారనే విషయం మరోసారి స్పష్టమైంది. ఆమె భర్త, డైరెక్టర్ విఘ్నేష్ శివన్ తో కలిసి చెన్నైలోని అత్యంత ప్రీమియం ఏరియాల్లో ఒకటైన పోయెస్ గార్డెన్ లో లగ్జరీ డూప్లెక్స్ అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేసినట్టు తెలుస్తోంది. ఇదే ఏరియాలోనే సూపర్‌స్టార్ రజినీకాంత్ కూడా నివసిస్తుండటం వల్ల ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు కూడా ఉంది. ఈ డూప్లెక్స్ అపార్ట్‌మెంట్ చెన్నైలోని తేనాంపేట్ ఏరియాలో ఉన్న లెగసీ ప్రాజెక్టులో నాలుగు, ఐదో అంతస్తుల్లో ఉంది. మొత్తం 14,369 చదరపు అడుగుల బిల్టప్ ఏరియాతో పాటూ, 5,308 చదరపు అడుగుల ల్యాండ్ షేర్ వాటా కూడా ఇందులో ఉంది. ఒక్కో చదరపు అడుగుకు సుమారు రూ.7.21 లక్షల ధరకు నయన్ ఈ ప్రాపర్టీని కొన్నట్టు తెలుస్తోంది. ఈ డూప్లెక్స్ విల్లాకు సంబంధించిన రిజిస్ట్రేషన్ గతేడాది డిసెంబర్ 15న పూర్తవగా, ల్యాండ్ మార్క్ మెట్రో ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి ఆమె దీన్ని కొనుగోలు చేసినట్టు తెలుస్తోంది. ఈ ప్రాపర్టీలో మొత్తం నయనతారకు 90% షేర్ ఉండగా, తన భర్త విఘ్నేష్ కు 10% షేర్ ఉంది. ఈ ఇంటిని ఆమె కేవలం ఓ ఇల్లులా మాత్రమే కాకుండా, ఫ్యూచర్ ఇన్వెస్ట్‌మెంట్ లాగా ప్లాన్ చేసుకున్నట్టు రియల్ ఎస్టేట్ నిపుణులు భావిస్తున్నారు. చెన్నైలోని పోయెస్ గార్డెన్ గత కొన్నేళ్లుగా ప్రీమియం రియల్ ఎస్టేట్ మార్కెట్ గా నిలవగా, అక్కడి ప్రాపర్టీల వాల్యూ రోజురోజుకీ విపరీతంగా పెరుగుతుండటం వల్ల సెలబ్రిటీలు అక్కడ ఇన్వెస్ట్ చేయడానికి ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. నటిగా బిజీగా కొనసాగుతున్న నయన్, కెరీర్లో మంచి ఆదాయం ఉన్న టైమ్ లోనే ఇలాంటి ఇన్వెస్ట్‌మెంట్స్ చేయాలని ప్లాన్ చేసుకుని ముందుకెళ్తున్నారు. లాంగ్ టర్మ్ ఇన్వెస్ట్‌మెంట్స్ లో పెట్టుబడి పెట్టడం సెలబ్రిటీల ప్లాన్ లో భాగమే అయినప్పటికీ, నయన్ దాన్ని మరింత ప్లాన్డ్ గా అమలు చేస్తున్నట్టు కనిపిస్తోంది. ఫ్యూచర్ లో ఆస్తుల విలువ పెరగడంతో పాటూ స్థిరమైన సంపద నిర్మాణం కూడా ఆమె టార్గెట్ గా పెట్టుకున్నట్టు తెలుస్తోంది. ఇక సినిమాల విషయానికొస్తే ఆమె పేట్రియాట్, టాక్సిక్ సినిమాలతో పాటూ బాలకృష్ణతో ఓ సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే.





# వృషకర్మ గ్లింప్స్ అద్భుతం: సుకుమార్

యువసామ్రాట్ నాగచైతన్య నటిస్తున్న మిథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ' ఫస్ట్ గ్లింప్స్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ గ్లింప్స్ చూసిన ప్రముఖ దర్శకుడు సుకుమార్, చిత్ర బృందంపై ప్రశంసల వర్షం కురిపించారు. సుకుమార్ రైటింగ్స్ కూడా ఈ నిర్మాణంలో భాగస్వామి కావడంతో, ఆయన ఈ అవుట్‌పుట్ పట్ల ఎంతో సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.సుకుమార్ అభినందనలపై నాగచైతన్య ట్విట్టర్ (చీ) వేదికగా స్పందిస్తూ.. 'థాంక్యూ సుకుమార్ గారు. మీలాంటి విజనరీ నుంచి ఇలాంటి మాటలు రావడం మాకు ఎంతో గౌరవంగా ఉంది. మీ ప్రశంసలు మాకు ఎంతో స్ఫూర్తినిస్తాయి' అంటూ కృతజ్ఞతలు తెలిపారు. కార్తీక్ దండు రూపొందించిన ఈ సూపర్ నేచురల్ ప్రపంచం సుకుమార్‌ను సైతం ఆశ్చర్యపరిచిందని చైతూ ట్వీట్ ద్వారా స్పష్టమవుతోంది. గతంలో కార్తీక్ దండు రూపొందించిన 'విరూపాక్ష' చిత్రానికి సుకుమార్ స్క్రీన్ ప్లే అందించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు 'వృషకర్మ'తో తన శిష్యుడు మరో అద్భుతాన్ని వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడని సుకుమార్ కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. దీంతో ఈ గురు-శిష్యుల బాండింగ్.. చైతన్యతో వారి అనుబంధం సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది.



# పుకార్లకు చెక్ పెట్టిన దురంధర్2 టీమ్!

బాలీవుడ్‌లో భారీ అంచనాలతో ఎదురుచూస్తున్న దురంధర్ 2: రివెంజ్ గురించి గత కొన్ని రోజులుగా వినిపిస్తున్న వాయిదా పుకార్లకు చివరికి క్లారిటీ వచ్చినట్టైంది. సినిమా రిలీజ్ కు మరికొన్ని రోజులే మిగిలి ఉన్నా ఎలాంటి అప్డేట్లు లేకపోవడంతో అభిమానుల్లో ఆందోళన పెరిగింది. ట్రైలర్, పాటలు, పోస్టర్లు లాంటివి ఎక్కడా కనిపించకపోవడంతో సినిమా చెప్పిన తేదీకే వస్తుందా లేదా అనే డౌట్స్ సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారి తీసాయి. అయితే ఈ సందేహాలకు ముగింపు పలుకుతూ చిత్ర యూనిట్ తాజాగా ట్రైలర్ రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. మేకర్స్ వెల్లడించిన వివరాల ప్రకారం మార్చి 7, ఉదయం 11.01 గంటలకు దురంధర్ 2 ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. ఈ అనౌన్స్‌మెంట్ తో సినిమా వాయిదా పడుతుందన్న ఊహాగానాలకు చెక్ పడినట్టైంది. ఒకవేళ సినిమా నిజంగానే వాయిదా పడే పరిస్థితి ఉంటే ఈ దశలో ట్రైలర్ విడుదలకు సిద్ధం కావడం కష్టమే. అందుకే ఈ అనౌన్స్‌మెంట్‌ను ఇండస్ట్రీ వర్గాలు కూడా ఒక ముఖ్యమైన సంకేతంగా చూస్తున్నాయి. ఇప్పటివరకు ప్రమోషన్ విషయంలో చిత్ర బృందం అనుసరించిన నిశ్శబ్ద విధానం కూడా చర్చనీయాంశమైంది. సాధారణంగా భారీ బడ్జెట్ సినిమాలు రిలీజ్ కు చాలా ముందే ట్రైలర్, పాటలు, ఇంటర్వ్యూలు, ఈవెంట్లతో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తుంటాయి. కానీ దురంధర్2 విషయంలో మాత్రం మేకర్స్ చాలా వరకు మౌనం పాటించారు. డైరెక్టర్ ఆదిత్య ధర్ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌లో బిజీగా ఉన్నాడన్న సమాచారం ఉన్నప్పటికీ, ప్రమోషన్ టీమ్ నుంచి ఎలాంటి కదలిక కనిపించకపోవడం అభిమానుల్లో సందేహాలను పెంచింది. ఆల్రెడీ ఓవర్సీస్ మార్కెట్‌లో ఈ సినిమాకు మంచి బజ్ నెలకొంది. అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభమైన అన్ని ప్రాంతాల్లో మంచి స్పందన కనిపిస్తోందన్న వార్తలొచ్చాయి. అలాంటి టైమ్ లో సినిమా వాయిదా పడితే ఇప్పటికే ఏర్పడిన హైప్‌పై ప్రభావం పడుతుందని ట్రేడ్ వర్గాలు భావించాయి. అందుకే ట్రైలర్ అనౌన్స్‌మెంట్‌ను ఇప్పుడు ఒక కీలక నిర్ణయంగా చూస్తున్నారు. మరోవైపు ఫ్యాన్స్ రెస్పాన్స్ కూడా ఆసక్తికరంగా మారింది. గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో సినిమా రిలీజ్ అవుతుందా లేదా? అంటూ ప్రశ్నలు లేవనెత్తిన ఫ్యాన్స్‌కు ఈ ట్రైలర్ డేట్ అనౌన్స్‌మెంట్ కొంత ఉపశమనాన్ని కలిగించిందని చెప్పొచ్చు. ముఖ్యంగా సీక్వెల్‌పై భారీ అంచనాలు పెట్టుకున్న అభిమానులు ఇప్పుడు ట్రైలర్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ట్రైలర్ విడుదలైన తర్వాతే సినిమా ప్రమోషన్ ఎలా ముందుకు సాగుతుందనే విషయంలో క్లారిటీ వస్తుంది. ట్రైలర్‌తో మేకర్స్ భారీ ప్రమోషన్లను మొదలుపెట్టే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మొత్తానికి ట్రైలర్ అనౌన్స్‌మెంట్‌తో దురంధర్2 చుట్టూ ఉన్న అనుమానాలు కొంతవరకు తగ్గినప్పటికీ, అసలు సినిమా ప్రభావం ఎలా ఉండబోతోందో చూడాలంటే ఇప్పుడు ట్రైలర్ కోసం వెయిట్ చేయాల్సిందే.

# 'కన్నప్ప' బ్యూటీ సైలెంట్ గా షాక్ ఇచ్చిందే!

'కన్నప్ప' చిత్రంతో ప్రీతీ ముకుందన్ ఒక్కసారిగా వెలుగులోకి వచ్చిన బ్యూటీ. అప్పటికే టాలీవుడ్ లో 'ఓం బీం భుష్ 'అనే చిత్రంతో ఎంట్రీ ఇచ్చినా? ఆ సినిమా రీచ్ అవ్వకపోడంతో ప్రీతీ పేరు ఎక్కడా బయటకు రాలేదు. అలాగని 'కన్నప్ప' హిట్ చిత్రం కాదు. మంచు ఫ్యామిలీ సినిమా కావడం సహా పాన్ ఇండియాలో పెద్ద ఎత్తున ప్రచారం దక్కడంతో? ప్రీతీ ముకుందన్ పేరు టాలీవుడ్ లో సంచలనంగా మారింది. నెమలి పాత్రలో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. అందం, అభినయంతో మంత్ర ముగ్దుల్నిచేసింది. ఆ తర్వాత మళ్లీ మరో తెలుగు సినిమాలో ఛాన్స్ అందుకోలేదు. కానీ ఈ బ్యూటీ చాప కింద నీరులా బాలీవుడ్ లో కూడా విస్తరిస్తుంది. ఏకంగా ఓ సినిమా షూటింగ్ ని సైతం క్లైమాక్స్ కు తీసుకొచ్చి సర్ ప్రైజ్ చేసింది. ఇంతకీ ఏంటా సినిమా అంటే వివరాల్లోకి వెళ్లాల్సిందే. కార్తీక్ ఆర్యన్ కథానాయకుడిగా మృగ్ దీప్ సింగ్ లాంబా 'నాగ్జిల్లా' చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో హీరోయిన్లగా చాలా మంది భామల్ని పరిశీలించారు. కానీ ఎవర్ని ఎంపిక చేసారు ? అన్నది మాత్రం అధికారికంగా ప్రకటించలేదు. దీంతో హీరోయిన్ స్థానం ఇంకా ఖాళీగానే ఉందని అంతా అనుకుంటున్నారు. కానీ ఆ స్థానంలో ప్రీతీముకుందన్ ఎంపిక చేసి సైలెంట్ గా షూటింగ్ కూడా పూర్తి చేస్తున్నారని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఇప్పటికే ఆమె పాత్రకు సంబంధించి కీలకమైన సన్నివేశాలు పూర్తి చేసారు. మరో ఏడు రోజుల పాటు షూటింగ్ కు హాజరైతే ఆమె పార్టు పూర్తవుతుంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థలు అధికారికంగా ఎక్కడా వెల్లడించలేదు. ప్రీఈతీ కూడా ఎక్కడా రివీల్ చేయలేదు. సైలెంట్ గా షూట్ పూర్తిచేసి షాక్ ఇచ్చింది. హీరోయిన్ పాత్రకు ప్రీతీ పర్ఫెక్ట్ గా సూటవుతుందనే ఆమెను ఎంపిక చేసినట్లు చిత్ర వర్గాలు వెల్లడించాయి. ఇందులో కార్తీక్ ఆర్యన్ నాగ్ అనే సర్పం పాత్ర పోషిస్తున్నాడు. ప్రీతీ ముందుకుందన్ పాత్ర ఎలా ఉంటుంది? అన్నది మాత్రం రివీల్ చేయలేదు. ఈ చిత్రాన్ని ధర్మ ప్రొడక్షన్స్- మహవీర్ జైన్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రీతీ ముకుందన్ విషయానికి వస్తే తెలుగుతో పాటు తమిళ, మలయాళ చిత్రాల్లో కూడా అమ్మడు అదృష్టాన్ని పరీక్షించుకుంది. కానీ అక్కడా అమ్మడు ఆశించిన ఫలితాలు సాధించలేదు. ఇంత వరకూ బిజీ నటిగా మారలేకపోయింది. ప్రస్తుతం తమిళ్ లో 'ఇదయాం మురళీ', తెలుగులో 'ఏమో ఏమో ఇది' చిత్రాల్లో నటిస్తోంది.



# చరిత్ర సృష్టించిన సంజూ శాంసన్..

టీమిండియా విధ్వంసకర ఓపెనర్ సంజూ శాంసన్ చరిత్ర సృష్టించాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే సింగిల్ ఎడిషన్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో రోహిత్ శర్మ రికార్డ్‌ను అధిగమించాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో ఇప్పటి వరకు 4 మ్యాచ్‌లు మాత్రమే ఆడిన సంజూ శాంసన్.. 16 సిక్స్‌లు బాదాడు. తద్వారా రోహిత్ శర్మ పేరిట ఉన్న 15 సిక్స్‌ల రికార్డును అధిగమించాడు. ఇంగ్లండ్‌తో గురువారం వాంఖడే వేదికగా జరిగిన మ్యాచ్‌లో సంజూ శాంసన్ 7 సిక్స్‌లు కొట్టడం ద్వారా ఈ ఘనతను అందుకున్నాడు. లీగ్ దశలో నమీబియాతో ఒక మ్యాచ్ ఆడిన సంజూ శాంసన్.. సూపర్-8లో జింబాబ్వే, వెస్టిండీస్‌పై బరిలోకి దిగాడు. నమీబియాతో మ్యాచ్‌లో మూడు సిక్స్‌లు బాదిన సంజూ.. జింబాబ్వేతో రెండు, వెస్టిండీస్‌పై నాలుగు సిక్స్‌లు కొట్టాడు. రోహిత్ శర్మ 2024 టీ20 ప్రపంచకప్‌లో 15 సిక్స్‌లు బాది ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండగా.. సంజూ శాంసన్ అధిగమించాడు. సింగిల్ ఎడిషన్ టీ20 ప్రపంచకప్‌లో సిక్స్‌లు బాదిన భారత బ్యాటర్ల జాబితాలో సంజూ శాంసన్(16) తర్వాత శివమ్




దూబే(15), రోహిత్ శర్మ(15), ఇషాన్ కిషన్(14), హార్దిక్ పాండ్యా(14), యువరాజ్ సింగ్ ఉన్నారు. ఇందులో రోహిత్(2026), యువరాజ్ సింగ్(2007) మినహా మిగతా బ్యాటర్లంతా ఈ ఎడిషన్‌లో సిక్స్‌లు బాదడం గమనార్హం. ఓవరాల్‌గా ఈ జాబితాలో ఫిన్ అలెన్ 20 సిక్సర్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. షిమ్రాన్ హెట్‌మైర్(19), ఫర్మాన్(18), నికోలస్ పూరన్(17) సంజూ శాంసన్ కంటే ముందున్నారు. న్యూజిలాండ్‌తో జరిగే ఫైనల్లో సంజూ తన జోరు కొనసాగిస్తే.. ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలవనున్నాడు. ఈ ఎడిషన్‌లో నాలుగు మ్యాచ్‌లే ఆడిన సంజూ రెండు హాఫ్ సెంచరీలతో 232 పరుగులు చేశాడు. పేలవ ఫామ్‌తో తుది జట్టులో చోటు కోల్పోయిన సంజూ.. లెఫ్ట్ రైట్ కాంబినేషన్‌లో భాగంగా అవకాశం అందుకొని ఆకాశమే హద్దుగా చెలరేగాడు.

# స్టేడియంలో భారత్‌కు చేదు అనుభవాలు..




ఐసీసీ ఈవెంట్లలో అహ్మదాబాద్ వేదికగా భారత్‌కు ఉన్న రికార్డును చూసి టీ20 ప్రపంచకప్ ఫైనల్‌కు ముందు ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ ఫలితం తర్వాత అహ్మదాబాద్‌లో 1,30,000 మంది అభిమానులకు చేదు జ్ఞాపకంగా మారింది. భారత క్రికెట్‌కు ఆరోజు బాధాకరమైన రోజులుగా మిగిలిపోయింది. మార్చి 8న జరగనున్న ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్‌పై క్రికెట్ ప్రపంచం దృష్టి సారించిన సమయంలో భారత మద్దతుదారులలో మోదీ స్టేడియంపై ఆందోళన కనిపిస్తోంది. ఇండియా ఇతర చోట్ల దాదాపు అజేయంగా ఉన్నప్పటికీ, అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం ఇటీవల స్వదేశీ జట్టుకు వ్యూహాత్మక, మానసిక పోరాట క్షేత్రంగా మారింది. అభిమానుల ఆందోళన కేవలం మూఢనమ్మకం మాత్రమే కాదు.. ప్రపంచంలోని అతిపెద్ద క్రికెట్ స్టేడియంలో టీమిండియాకు పరాభవాలు ఎదురవ్వడమే దీనికి కారణం. అహ్మదాబాద్ ఫోబియాకు ప్రధాన కారణం 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్. భారత్ ఆ మ్యాచ్‌లో వరుసగా 10 విజయాల రికార్డుతో ప్రవేశించి ఫైనల్లోనూ గెలుపు ఖాయమనిపించింది. కానీ అక్కడి నెమ్మదైన పిచ్, ఆస్ట్రేలియా బౌలింగ్ అటాక్ వ్యూహాలతో ఆ మ్యాచులో భారత్‌కు ఘోర పరాజయం తప్పలేదు. అహ్మదాబాద్‌లో ఆ నిశ్శబ్దం ఇప్పటికీ ఒక చేదు జ్ఞాపకంగానే ఉంది. ప్రస్తుత టీ20 ప్రపంచకప్ ఫైనల్ పాత భయాలను మరింత పెంచింది. ఫిబ్రవరి 22న ఇదే వేదికపై భారత్ సాధించిన వరుస 12 టీ20 విజయాల రికార్డు బద్దలైంది. సూపర్ 8 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో తలపడిన సూర్యకుమార్ సేన కేవలం 111 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ ఘోర పరాజయం అహ్మదాబాద్ పిచ్ కండిషన్స్‌పై జట్టుకు ఇంకా పూర్తి పట్టు రాలేదని నిరూపించింది. అహ్మదాబాద్ పిచ్‌లు ఎప్పటినుంచో అస్థిరంగా ఉంటున్నాయి. డే-నైట్ మ్యాచ్‌లలో మొదటి ఇన్నింగ్స్‌లో పిచ్ "స్పంజీ" బౌన్స్‌ను ఇస్తుంది. దీనివల్ల మిస్టర్ 360 డిగ్రీగా పేరున్న సూర్యకుమార్ యాదవ్ వంటి ఆటగాళ్లు సైతం టైమింగ్ దొరకక ఇబ్బంది పడతారు. రెండో ఇన్నింగ్స్‌లో మంచు కురిసినప్పుడు, పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా మారి ఛేజింగ్ చేసే జట్టుకు ప్రయోజనం చేకూరుస్తుంది. ఈ టాస్ అంశం సైతం అభిమానులను భయపెడుతోంది.

# 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ'కి భారత్ నుంచి 'ఒకే ఒక్కడు'

2026 ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ క్లైమాక్స్‌కు చేరుకుంది. మార్చి 08న అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియం వేదికగా ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ టైటిల్ ఫైట్‌లో భారత్ - న్యూజిలాండ్ తలపడనున్నాయి. అయితే ఐసీసీ నిర్వహించే ప్రతీ టోర్నమెంట్?లో అత్యుత్తమంగా ప్రదర్శన కనబర్చిన ఆటగాడికి నిర్వాహకులు 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు ఇస్తుంటారు. ఈ క్రమంలో ప్రస్తుత టోర్నీలోనూ ఆయా జట్ల నుంచి పలువురు ప్లేయర్లు అత్యుత్తమ ఆటతీరు కనబర్చారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా ఆయా విభాగాల్లో అద్భుతంగా ఆడి తమతమ జట్ల విజయాల్లో కీలక పాత్ర పోషించారు. మరికొందరైతే ఏకంగా వరల్డ్ రికార్డులు క్రియేట్ చేశారు. అయితే టోర్నీ ముగింపు దశకు చేరుకోవడంతో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డుకు ఐసీసీ నామినీల పేర్లను రివీల్ చేసింది. మొత్తం 20 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో ఎనిమిది మంది పేర్లను 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డుకు ఐసీసీ పరిశీలిస్తుంది. ఈ మేరకు షార్ట్‌లిస్ట్ చేసిన లిస్ట్‌ను శుక్రవారం రిలీజ్ చేసింది. జాబితాలో ఉన్న ప్లేయర్లను ఓటింగ్ ద్వారా ఎంపిక చేయనున్నట్లు పేర్కొంది. మెజార్టీ ఓటింగ్ దక్కించుకున్న ఆటగాడికి ఆదివారం ఫైనల్ మ్యాచ్ అనంతరం ఈ అవార్డును ఐసీసీ అందజేస్తుంది. అవార్డుతో పాటు ప్రైజ్‌మనీ కూడా ఉంటుంది. ఇంగ్లాండ్ ఆల్?రౌండర్ విల్ జాక్స్ ఈ లిస్ట్‌లో చోటు దక్కించుకున్నాడు. ఈ టోర్నీలో బ్యాటింగ్, బౌలింగ్ ప్రదర్శనతో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఈ టోర్నీలో ఇంగ్లాండ్ మొత్తం ఎనిమిది మ్యాచ్?లు ఆడగా అందులో ఆరింట్లో నెగ్గింది. అయితే ఆరు మ్యాచ్?ల్లో నెగ్గిన సందర్భాల్లో నాలుగుసార్లు విల్ జాక్స్?కే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కడం విశేషం. 8 మ్యాచ్?ల్లో 226 పరుగులు బాదగా, 9 వికెట్లు పడగొట్టాడు.పాకిస్థాన్ బ్యాటర్ షహిబ్?జాదా ఫర్హాన్ ఈ రేస్?లో ఉన్నాడు. అతడు ఈ టోర్నీలో అత్యధిక పరుగులు బాదిన బ్యాటర్?గా టాప్?లో ఉన్నాడు. అతడు ఆరు మ్యాచ్?ల్లో 76.60 సగటుతో 383 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. అతడు శ్రీలంక, నమీబియాతో మ్యాచ్?ల్లో శతకాలు నమోదు చేశాడు. అయితే సింగిల్ టీ20 వరల్డ్?కప్ ఎడిషన్?లో అత్యధిక పరుగులు, అత్యధిక సెంచరీలు బాదిన బ్యాటర్?గానూ ఫర్హాన్ రికార్డ్ కొట్టాడు. సౌతాఫ్రికా సెమీఫైనల్?కు చేరడంలో కీలక పాత్ర పోషించాడు పేసర్ లుంగి ఎంగ్డి. ఈ టోర్నీలో ఏడు మ్యాచ్?ల్లో ఎంగ్డి పొదుపుగా బౌలింగ్ చేస్తూ 12 వికెట్లు నేలకూల్చాడు. టోర్నీ ఆసాంతం నిలకడగా రాణించాడు. ముఖ్యంగా కెనడాపై 4, అఫ్గానిస్థాన్?పై ఉత్కంఠ మ్యాచ్?లో 3 వికెట్లు దక్కించుకున్నాడు. సూపర్ 8లో భారత్?పై వికెట్ పడగొట్టకున్నా నాలుగు ఓవర్ల కోటాలో కేవలం 15 పరుగులే ఇచ్చాడు. సౌతాఫ్రికా కెప్టెన్ ఎయిడెన్ మార్?క్రమ్ కూడా నిలకడగా ఆడాడు. ఎనిమిది మ్యాచ్?ల్లో మూడుసార్లు 50ం స్కోర్లు నమోదు చేశాడు. తొలి మ్యాచ్?లో కివీస్?పై 86 పరుగులు బాది నాటౌట్?గా నిలిచాడు. తర్వాత వెస్టిండీస్?పైనా 86 రన్స్ చేసి విజయంలో కీలక పాత్ర పోషించాడు. మొత్తం 286 పరుగులు చేశాడు. ఇక సూపర్ 8 లో భారత్?తో మ్యాచ్?లో జోరుమీదున్న ఇషాన్ కిషన్? వికెట్ పడగొట్టాడు. న్యూజిలాండ్ యంగ్ బ్యాటర్ రచిన్ రవీంద్ర ఈ టోర్నీలో బ్యాట్ కంటే ఎక్కువగా బంతిలోనే రాణించాడు. హిట్టర్?గా పేరున్న రచిన్ పరుగులు తక్కువగానే చేసినప్పటికీ ఫుల్?టైమ్ బౌలర్?కు ధీటుగా వికెట్లు పడగొట్టి జట్టు విజయాల్లో కీలకం అయ్యాడు. తప్పక నెగ్గాల్సిన సూపర్ 8 పోరులో శ్రీలంకపై నాలుగు వికెట్లు పడగొట్టి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నాడు. ఆ తర్వాత ఇంగ్లాండ్?పైనా 3 వికెట్లు పడగొట్టాడు. టోర్నీలో మొత్తం 11 వికెట్లు తీసి, 128 పరుగులు చేశాడు. అయితే కివీస్ ఫైనల్?కు అర్హత సాధించింది. దీంతో అతడు ఫైనల్?లో గణాంకాలు పెంచుకునే ఛాన్స్ ఉంది. అమెరికా క్రికెటర్ షాడ్లీ వాన్ షాల్క్విక్ ఈ లిస్ట్?లో చోటు దక్కించుకున్నాడు. అమెరికా ఆడింది నాలుగు మ్యాచ్?లే అయినప్పటికీ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. కేవలం నాలుగు మ్యాచ్?ల్లోనే 6.80 ఎకనమీతో ఏకంగా 13 వికెట్లు నేలకూల్చాడు. ఇందులో భారత్, పాకిస్థాన్ లాంటి మేటి జట్లపై నాలుగేసి వికెట్లు తీయడం విశేషం. అలాగే ఇప్పటికీ ఈ టోర్నీలో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్?గా షాడ్లీ టాప్‌లో కొనసాగుతుండడం విశేషం. టోర్నీ ప్రారంభం నుంచి సీఫెర్ట్ నిలకడగా ఆడుతున్నాడు. సౌతాఫ్రికాతో జరిగిన సెమీస్‌లోనూ 58 పరుగులు బాదాడు. 8 మ్యాచ్?ల్లో 45 యావరేజ్‌తో 274 పరుగులు బాదాడు. టీమ్‌ఇండియా ఇప్పటిదాకా ఈ టోర్నీలో 8 మ్యాచ్?లు ఆడింది. కానీ, సంజు శాంసన్?కు కేవలం నాలుగు మ్యాచ్?ల్లోనే బరిలో దిగే ఛాన్స్ వచ్చింది. తొలి రెండుసార్లు విఫలమైనప్పటికీ కీలకమైన సూపర్ 8, సెమీస్?లో మాత్రం విజయంలో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా విండీస్?పై 97లి భారీ ఇన్నింగ్స్‌తో జట్టును సెమీస్ చేర్చాడు. ఇక సెమీస్?లో ఇంగ్లాండ్‌పై 89 రన్స్ చేశాడు. ఈ రెండింట్లోనూ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. అతడు 4 మ్యాచ్?ల్లో 77.33 యావరేజ్?తో 232 పరుగులు చేశాడు.

# ఓడిపోయినా.. చివరి వరకు పోరాడాం.!

## ఇంగ్లాండ్ హెడ్ కోచ్ బ్రెండన్ మెక్‌కలమ్



టీ20 ప్రపంచకప్ రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌పై ఏడు పరుగుల తేడాతో టీమిండియా అద్భుత విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ కీలక మ్యాచ్‌లో ఇంగ్లాండ్ ఆటగాడు జాకబ్ బేతల్ టీం ఇండియా బౌలర్లపై చివరి వరకు ధైర్యంగా పోరాడాడు. అయితే, మ్యాచ్ చివరి దశలో భారత బౌలర్లు పరుగులను నియంత్రించడంలో, కీలక వికెట్లు తీయడంలో విజయవంతమయ్యారు. ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రా వేసిన రెండు ఓవర్లలో ఇంగ్లాండ్ బ్యాటర్లు పరుగులు రాబట్టడానికి తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. బుమ్రా ఓవర్‌లోనే జాకబ్ బేతల్ రనౌట్ అవ్వడం ఇంగ్లాండ్‌కు చావుదెబ్బగా మారింది. ఈ మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా రెండు వికెట్లు తీయడమే కాకుండా, సెంచరీ వీరుడైన జాకబ్ బేతల్‌ను రనౌట్ రూపంలో పెవిలియన్‌కు పంపడంలో కీలక పాత్ర పోషించాడు. అక్షర్ పటేల్ ఫీల్డింగ్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి టీం ఇండియా విజయానికి దోహదపడ్డాడు. మ్యాచ్ అనంతరం ఇంగ్లాండ్ హెడ్ కోచ్ బ్రెండన్ మెక్‌కలమ్ తమ జట్టు ఓటమిపై స్పందించారు. "మేము విజయం కోసం చివరి వరకు పోరాడాం. చివరి ఓవర్లలో భారత బౌలర్లు పుంజుకోవడమే మా ఓటమికి ప్రధాన కారణం" అని ఆయన పేర్కొన్నారు. మ్యాచ్ ఆరంభంలో బ్రూక్ వదిలేసిన క్యాచ్ టీం ఇండియా భారీ స్కోర్‌కు పునాది వేసిందని, అలాగే చివరి దశలో బౌలింగ్‌లో టీం ఇండియా అద్భుతంగా పుంజుకుందని మెక్‌కలమ్ విశ్లేషించారు. వరుస విరామాలతో వికెట్లను కోల్పోవడమే కాకుండా, జాకబ్ బేతల్ రనౌట్ అవ్వడంతో మ్యాచ్ ఒక్కసారిగా మలుపు తిరిగిందని, అక్కడే తమ ఓటమి ఖరారు అయిపోయిందని ఆయన తెలిపారు. ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో పరుగులు రాబట్టడం చాలా కష్టంగా మారిందని, అతని స్పెల్ తమ ఓటమిని శాసించిందని బ్రెండన్ మెక్‌కలమ్ పేర్కొన్నారు. తమ జట్టు కుర్రాడు జాకబ్ బేతల్ ఆడిన అద్భుతమైన ఇన్నింగ్స్‌ను మెక్‌కలమ్ కొనియాడారు. అతడు ఎంతటి గొప్ప ఆటగాడో మరోసారి ప్రపంచానికి తెలిసిందని మెక్‌కలమ్ అన్నారు. 250 పరుగుల భారీ లక్ష్యం ఉన్నప్పటికీ, తమ జట్టు చివరి వరకు పోరాడిందని మెక్‌కలమ్ పేర్కొన్నారు. ఓడిపోయినప్పటికీ, తమ జట్టు చూపించిన ధైర్యం చూసి తాను గర్వపడుతున్నానని తెలిపారు. "టీం ఇండియా సొంత గడ్డపై ఇలా చెలరేగుతుందని మేము ముందే ఊహించాం. అయితే, అంచనాలను అందుకునే క్రమంలో చివరికి బోల్తా పడ్డాం" అని బ్రెండన్ మెక్‌కలమ్ తమ నిరాశను వ్యక్తం చేశారు. మొత్తంమీద, భారత బౌలర్ల వ్యూహాత్మక ప్రదర్శన, కీలక సమయాల్లో వికెట్లు తీయడం, అలాగే ఫీల్డింగ్ మెరుపులే ఇంగ్లాండ్ ఓటమికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.

# హార్దిక్ పాండ్యాపై ప్రశంసల జల్లు



ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఇంగ్లాండ్ జట్టుతో జరిగిన సెమీఫైనల్ పోరులో హార్దిక్ పాండ్యా అద్భుతమైన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో భారత్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఇంగ్లాండ్‌పై భారత్ సాధించిన ఉత్కంఠభరిత విజయం తర్వాత టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాపై ప్రశంసల జల్లు కురుస్తోంది. ముఖ్యంగా ఆర్సీబీ దిగ్గజం, దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ హార్దిక్ పాండ్యాను 'బిగ్ మ్యాచ్ ప్లేయర్'గా అభివర్ణించాడు.మ్యాచ్ ముగిసిన అనంతరం డుప్లెసిస్ మాట్లాడుతూ.. హార్దిక్ పాండ్యాలోని పోరాట పటిమను, క్లిష్ట పరిస్థితుల్లో అతను చూపించే సమయ-స్ఫూర్తిని కొనియాడారు. "ఒక ఆటగాడికి నైపుణ్యం ఎంత ముఖ్యమో, ఒత్తిడిని తట్టుకునే మనస్తత్వం కూడా అంతే ముఖ్యం. కొన్నిసార్లు టాలెంట్ కంటే ఆటగాడి క్యారెక్టర్‌ను బట్టి వారిని ఎంపిక చేయడం సరైన నిర్ణయం అవుతుంది. పాండ్యా అటువంటి క్యారెక్టర్ ఉన్న ప్లేయర్, అతను పెద్ద స్టేజ్ కోసమే పుట్టినట్లుగా కనిపిస్తాడు" అని డుప్లెసిస్ పేర్కొన్నాడు. ఈ మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ తన విలువను నిరూపించుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌లో కేవలం 12 బంతుల్లోనే 27 పరుగులు (3 ఫోర్లు, 2 సిక్సర్లు) చేసి, భారత జట్టు స్కోరును 253 పరుగుల భారీ లక్ష్యం వైపు తీసుకెళ్లడంలో తనవంతు పాత్ర పోషించాడు. ఆ తర్వాత బౌలింగ్‌లో అత్యంత కీలకమైన సమయంలో బరిలోకి దిగి, ఇంగ్లాండ్ బ్యాటర్లు ఫిల్ సాల్ట్, సామ్ కరన్‌ల వికెట్లను తీసి ప్రత్యర్థి జట్టును ఒత్తిడిలోకి నెట్టాడు. ముఖ్యంగా ఇంగ్లాండ్ గెలుపు దిశగా సాగుతున్న సమయంలో హార్దిక్ వేసిన పెనాల్టీ ఓవర్ మ్యాచ్ గమనాన్నే మార్చేసింది. 41 ఏళ్ల డుప్లెసిస్ మాట్లాడుతూ, కోచ్‌లు ఆటగాళ్లను ఎంపిక చేసేటప్పుడు కేవలం టాలెంట్‌ను మాత్రమే కాకుండా, వారిలో ఉన్న 'ధైర్యాన్ని' డా చూస్తారని వివరించాడు హార్దిక్ పాండ్యా వంటి ఆటగాళ్లు ఒత్తిడి పెరిగే కొద్దీ మరింత మెరుగ్గా రాణిస్తారని.. అటువంటి ధైర్యం, క్యారెక్టర్ ఉన్న వ్యక్తులు జట్టుకు ఎంతగానో ఉపయోగపడతారని డుప్లెసిస్ అభిప్రాయపడ్డాడు. 2024 వరల్డ్ కప్‌లోనూ భారత్ విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించిన హార్దిక్ పాండ్యా.. ఇప్పుడు 2026లో కూడా అదే జోరును కొనసాగిస్తూ టీమిండియాకు ప్రధాన ఆయుధంగా మారాడు. ఈ సెమీఫైనల్ విజయంతో భారత్ ఫైనల్‌కు చేరుకుంది. హార్దిక్ పాండ్యా ప్రదర్శన అభిమానులకు, మాజీ ఆటగాళ్లకు కూడా ఎంతో సంతోషాన్ని ఇచ్చింది.

# పాక్ ఆటగాడిపై టీమిండియా దిగ్గజం ఫైర్!

టీ20 వరల్డ్ కప్ 2026 సెమీఫైనల్లో ఇంగ్లాండ్ జట్టుపై భారత్ అద్భుత విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లిన వేళ సోషల్ మీడియా వేదికగా ఆసక్తికరమైన పోరు సాగుతోంది. భారత మాజీ క్రికెటర్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ పాకిస్థాన్ మాజీ పేసర్ మహమ్మద్ ఆమిర్‌ను లక్ష్యంగా చేసుకుని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. భారత్ సెమీఫైనల్‌కు చేరదని.. ఇంగ్లాండ్ గెలుస్తుందని ఆమిర్ చేసిన జోస్యాలను సిద్ధూ ఎద్దేవా చేశారు.ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఒక వీడియోలో నవజ్యోత్ సింగ్ సిద్ధూ మాట్లాడుతూ.. మహమ్మద్ ఆమిర్‌ను "దొంగ బాబా" అని సంబోధించారు. "మన చుట్టూ ఉన్న కొందరు వ్యక్తులకు తప్పుడు అంచనాలు వేయడం అలవాటుగా మారింది. అది నిజమైతే తాము గొప్ప జ్ఞానులమని చెప్పుకుంటారు, లేదంటే సైలెంట్‌గా ఉంటారు. అమీర్ చెప్పినవన్నీ తప్పని రుజువయ్యాయి. వెస్టిండీస్, దక్షిణాఫ్రికా జట్లు ముందడుగు వేస్తాయని చెప్పారు.. కానీ సంజూ శాంసన్ రాకతో ఆ రెండు జట్లు ఇంటికి వెళ్లాయి. ఇంగ్లాండ్ గెలుస్తుందని ఈరోజు చెప్పారు.. కానీ ఇంగ్లాండ్ కూడా ఓడిపోయింది" అని సిద్ధూ ఎద్దేవా చేశారు.సిద్ధూ తనదైన శైలిలో మహమ్మద్ ఆమిర్‌పై విమర్శలు చేస్తూ కొన్ని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. "జోస్యాలు ఏమీ నిర్ణయించవు, ఫలితాలు మైదానంలో తేలుతాయి. భిక్షాటనతో సింహాసనం దక్కదు. ఖాళీ పాత్రలే ఎక్కువ శబ్దం చేస్తాయి. ఆమిర్ పరిస్థితి కూడా అలాగే ఉంది" అని మండిపడ్డారు. మ్యాచ్‌లు గెలవాలంటే మైదానంలో సత్తా చాటాలని, కేవలం మాటలతో కాదని హితవు పలికారు.భారత్ విజయం సాధించినప్పటికీ మహమ్మద్ ఆమిర్ తన పంతాన్ని వీడలేదు. భారత్ గొప్పగా ఆడిందని అంగీకరిస్తూనే, ఇంగ్లాండ్ ఫీల్డింగ్ తప్పిదాల వల్లే ఓడిపోయిందని వాదించారు. "నేను క్రికెట్ గురించే మాట్లాడుతున్నాను. ఇంగ్లాండ్ ఓ ముఖ్యమైన క్యాచ్ వదిలేయడం వల్లే మ్యాచ్ ఓడిపోయింది. ఫామ్ లో ఉన్న బ్యాటర్ (సంజూ శామ్సన్) క్యాచ్‌ను హ్యారీ బ్రూక్ పట్టుకుని ఉంటే, ఇంగ్లాండ్ మరో ఓవర్ మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించేది. ఇరు జట్ల మధ్య తేడా కేవలం బుమ్రా మాత్రమే" అని ఆమిర్ తన కామెంట్లను సమర్థించుకున్నాడు.

# మెంథ తుఫాను బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

**ఎకరాకు పదివేలు ఇస్తామన్న హామీ ఏమైంది?**

**హుస్నాబాద్‌లో 4 వేల మంది రైతుల ఎదురుచూపులు**

**ఆదుకోకపోతే ఆందోళన తప్పదు పచ్చిమట్ల రవీందర్**



హుస్నాబాద్, జనత న్యూస్:మెంథ తుఫాను కారణంగా సర్వం కోల్పోయిన రైతాంగాన్ని ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ విమర్శించారు. తుఫాను వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా, ఇప్పటివరకు నష్టపరిహారం ఊసే లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.గతేడాది కురిసిన అకాల వర్షాలకు హుస్నాబాద్ నియోజకవర్గంలో వరి, మొక్కజొన్న, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని రవీందర్ గౌడ్ పేర్కొన్నారు. చేతికి వచ్చిన పంట నేలపాలవడంతో రైతులు కోలుకోలేని విధంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ జరిపిన ప్రాథమిక విచారణలో నియోజకవర్గవ్యాప్తంగా దాదాపు 4,000 మంది రైతులు నష్టపోయినట్లు నివేదికలు ఇచ్చినా, ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు.ఎన్నికల సమయంలోనూ, ఆ తర్వాతా యుద్ధ ప్రాతిపదికన ఎకరానికి రూ.10,000 చొప్పున నష్టపరిహారం అందిస్తామని ప్రకటించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఇప్పుడు ఆ విషయాన్ని విస్మరించిందని దుయ్యబట్టారు. అటు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కూడా రైతుల గోడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కనీసం పెట్టుబడి సాయం కింద అందాల్సిన 'రైతు భరోసా' (రైతుబంధు) కూడా మార్చి నెల వచ్చినా అందకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.తక్షణమే నష్టపోయిన ప్రతి రైతుకూ రూ.10,000 పరిహారంతో పాటు బకాయి ఉన్న రైతుబంధును విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితుల పక్షాన నిలబడి బీఎస్పీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు విక్రం ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

**మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి**



హుస్నాబాద్,జనత న్యూస్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, కమిషనర్ టి. మల్లికార్జున్ ఆధ్వర్యంలో మల్లెచెట్టు చౌరస్తా నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు, మున్సిపల్ కార్మికులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ... పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను ప్రజలకు వివరించారు.ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పట్టణ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె కోరారు. ముఖ్యంగా చెత్తను రోడ్లపై బహిరంగంగా వేయకుండా, తడి,పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకే అందించాలని సూచించారు. పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మతో పాటు కౌన్సిలర్లు ఆకుల రజిత, చెన్నబోయిన అనూష, బూరుగు లత, కొండ రజిత, పిల్లి తిరుపతి, బొలిశెట్టి రాజు, భూక్యా సంపత్, కాశబోయిన సరిత, గడిపే సతీష్ కుమార్, సావుల మంజుల, పూదరి వరప్రసాద్, కేశవేణి రమేష్, బొల్లి శ్రీనివాస్, వైద్యం కిరణ్ ప్రసాద్, గాదెపాక రవీందర్, వాల సుప్రజ, బత్తుల స్వరూప, గోపగోని శోభన్ బాబు, మున్సిపల్ అధికారులు, వార్డు ఆఫీసర్లు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌లో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



హుస్నాబాద్, జనత న్యూస్: హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కళ్యాణ లక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 20వ వార్డు కౌన్సిలర్ గోపగోని శోభన్‌బాబు ఆధ్వర్యంలో 20వ వార్డుకు చెందిన సంగ్యం కావ్య, ఆడేపు వాణి,కొయాడ హర్షిత,మంథేన నిఖిత నలుగురు లబ్ధిదారులకు ఈ చెక్కులను అందజేశారు.కార్యక్రమానికి పురపాలక సంఘ చైర్‌పర్సన్ దండి లక్ష్మి అధ్యక్షత వహించి లబ్ధిదారులకు చెక్కులను అందించారు.ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ కమిషనర్ మల్లికార్జున, ఎంఆర్వో లక్ష్మారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మతో పాటు పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను సమష్టిగా విజయవంతం చేద్దాం

**కరీంనగర్ ఉమ్మడి జిల్లాను అగ్రస్థానంలో నిలుపుదాం : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



కరీంనగర్, జనతా న్యూస్, మార్చి 6: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు కలిసి విజయవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ మంత్రి, కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో 99 రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజల సమస్యలను పరిష్కరించడం, ప్రభుత్వం చేపట్టిన









అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అగ్రస్థానంలో నిలపాలని అన్నారు.

**రాజకీయాలకు అతీతంగా విజయవంతం చేయాలి**

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి విజయవంతం చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకుని కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

**ప్రజలకు భరోసా కల్పించడమే లక్ష్యం**

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు భరోసా కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రజల వద్దకే పాలన చేరుతుందని తెలిపారు.

**అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులు**

సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నారాయణపూర్ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువ పనులు పూర్తి చేయాలని, రూ.20 కోట్లు విడుదల చేయాలని కోరారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కల్వల ప్రాజెక్ట్ ఆధునీకరణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నగరంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు.

## డంప్ యార్డ్ సమస్య పరిష్కరించాలి

**మేయర్ కొలగాని శ్రీనివాస్**

కరీంనగర్ నగరంలో ప్రధాన సమస్యగా ఉన్న డంప్ యార్డ్ సమస్యను పరిష్కరించేందుకు మంత్రులు ప్రత్యేక చొరవ చూపాలని మేయర్ కొలగాని శ్రీనివాస్ కోరారు. నగరంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**మిషన్ మోడ్‌లో అమలు చేస్తాం : జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

కరీంనగర్ జిల్లాలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మిషన్ మోడ్‌లో నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు హర్కరా వేణుగోపాలరావు, మినిమమ్ వేజెస్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ జనక్ ప్రసాద్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, అడిషనల్ కలెక్టర్లు లక్ష్మికిరణ్, అశ్విని తానాజీ వాకడే, సిరిసిల్ల ఎస్పీ మహేష్ బి. గితే, జగిత్యాల ఎస్పీ అశోక్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.



# నమో.. నరసింహ.. ఘనంగా రథోత్సవము

**ముగిసిన నల్లగొండ జాతర**



తిమ్మాపూర్, జనతా న్యూస్ : భక్తుల కోరిన కోర్కెలు తీర్చే తిమ్మాపూర్ మండలంలోని నల్లగొండ శ్రీ సీతారామ లక్ష్మీనరసింహస్వామి జాతర ముగిసింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి రథోత్సవము ఘనంగా జరిగింది. గురువారం అర్ధ రాత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మేళ తాలాల మధ్యన స్వామి వారిని ఊరేగింపుగా ఆలయం నుండి రథం పైకి తీసుకొచ్చారు. రాత్రి నుండి భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రథంపైన రూపాయి బిల్ల పెట్టి మొక్కులు తీర్చుకోవడం పురాతన కాలం నుండి ఆనవాయితీగా వస్తుండగా భక్తులు దానిని కొనసాగించారు. రథంపైన స్వామి వారిని దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి పూజలు



చేశారు. దివిటీలను, కాగడాలను వెలిగించి రథం ఎదుట జీవాలను బలి చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గండదీపంలో నూనెను పోశారు. ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని అర్చనలు చేయించుకుని, కొబ్బరి కాయలు కొట్టి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సాయంత్రం స్వామి వారు రథం నుండి గర్భ గుడికి వేం చేశారు. ఈ అద్భుతమైన ఘట్టాన్ని భక్తులు తరించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ చైర్మన్ బండారిపల్లి లక్ష్మన్, ఈవో అనిల్ కుమార్, కమిటీ సభ్యులు, దాతలు, వాలంటీర్లు వసతులు కల్పించారు. రథోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని దుకాణాలు భక్తులతో కిటకిటలాడాయి.రథోత్సవ వేడుకలకు నల్లగొండతోపాటు మండలంలోని పలు గ్రామాల నుండి,. కరీంనగర్ జిల్లా కేంద్రం నుండి, వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయంకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

# ఖమ్మంలో అధునాతన ప్రెస్ క్లబ్ నిర్మాణానికి చర్యలు : మంత్రి పొంగులేటి



ఖమ్మం, జనతా న్యూస్, మార్చి 6: ఖమ్మం జిల్లా కేంద్రంలో అధునాతన సదుపాయాలతో ప్రెస్ క్లబ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఖమ్మంలోని తన నివాసంలో వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) ఖమ్మం జిల్లా ప్రతినిధులు మంత్రిని కలిసి జర్నలిస్టులకు సంబంధించిన పలు అంశాలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్, కో కన్వీనర్లు యెన్నబోయిన శ్రీనివాసరావు, అమరనేని రామకృష్ణ, ఖమ్మం నియోజకవర్గ కన్వీనర్ కె. కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా నాయకులు బొడ్డుపల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డబ్ల్యూజేఐ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రస్తుతం ఖమ్మంలో ఉన్న ప్రెస్ క్లబ్ జర్నలిస్టుల అవసరాలకు సరిపోవడం లేదని, అక్కడ పార్కింగ్ సౌకర్యం కూడా లేకపోవడంతో సమావేశాలు నిర్వహించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కొత్తగా స్థలం కేటాయించి ఆధునిక సదుపాయాలతో ప్రెస్ క్లబ్ భవనం నిర్మించాలని కోరారు. అలాగే నియోజకవర్గ కేంద్రాల్లో కూడా ప్రెస్ క్లబ్ భవనాల నిర్మాణానికి స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. నిర్మాణాలు పూర్తయ్యే వరకు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను తాత్కాలికంగా కేటాయించాలని సూచించారు. అవకాశం ఉన్న చోట ఇందిరమ్మ మోడల్ హౌస్‌లను ప్రెస్ క్లబ్బుల నిర్వహణకు ఇవ్వాలని కూడా విన్నవించారు. అదేవిధంగా ఖమ్మం జిల్లా అక్రిడేషన్ కమిటీలో డబ్ల్యూజేఐ ప్రతినిధులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి పొంగులేటి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి డబ్ల్యూజేఐ ప్రతినిధులకు అక్రిడేషన్ కమిటీలో స్థానం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన తెలంగాణ మీడియా అక్రిడేషన్ రూల్స్--2025లో కొన్ని నిబంధనలు జిల్లాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇబ్బందిగా మారుతున్నాయని ప్రతినిధులు తెలిపారు. చిన్న పత్రికలకు జిల్లా కేంద్రాల్లో అక్రిడేషన్ కార్డులు ఇవ్వడం లేదని, కొన్ని కేటగిరీల్లో చాలా తక్కువ సంఖ్యలో మాత్రమే కార్డులు ఇస్తున్నారని వివరించారు. ఫీల్డ్, డెస్క్, ఫ్రీలాన్స్, వెబ్‌సైట్, కేబుల్ టీవీ జర్నలిస్టులకు కూడా అక్రిడేషన్ కార్డులు మంజూరు చేసేలా నిబంధనలు సవరించాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి పొంగులేటి సానుకూలంగా స్పందించినట్లు యూనియన్ ప్రతినిధులు తెలిపారు.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక ప్రారంభం

## చంద్రపూర్ కాలనీలో పారిశుధ్య, అభివృద్ధి పనులకు శ్రీకారం



కరీంనగర్, జనతా న్యూస్, మార్చి 7: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కరీంనగర్ నగరంలోని 66 డివిజన్లను అభివృద్ధి చేసే దిశగా పాలకవర్గం పని చేస్తుందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ నగరంలోని 1, 2 డివిజన్ పరిధిలోని చంద్రపూర్ కాలనీలో శుక్రవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశంతో కలిసి మేయర్ ప్రారంభించారు. ప్రభుత్వ నిర్దేశాల మేరకు నగరపాలక సంస్థ రూపొందించిన ప్రణాళిక ప్రకారం పారిశుధ్య, అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 1, 2 డివిజన్లలో పరిసరాలను శుభ్రం చేయడం, ఖాళీ స్థలాల్లో ఉన్న చెత్తను తొలగించడం, వివిధ రకాల వ్యర్థాలను తొలగించడం, డ్రైనేజీలలో సిల్ట్ తొలగించే పనులు చేపట్టారు. అనంతరం మేయర్ కొలగాని శ్రీనివాస్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ 10 లక్షల రూపాయలతో చేపట్టనున్న డ్రైనేజీ అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నగరంలోని అన్ని డివిజన్లను సమానంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. విలీన గ్రామాల డివిజన్లలో కూడా అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని సమ్మర్ యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రజలకు తాగునీరు అందిస్తామని తెలిపారు. అమృత్ 2.0 పథకం కింద రూ.147 కోట్లతో పైప్‌లైన్ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, అవసరమైన చోట రిజర్వాయర్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా డివిజన్ల వారీగా పారిశుధ్య పనులు, అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. డ్రైనేజీలలో సిల్ట్ తొలగించడం, శిథిలావస్థలో ఉన్న డ్రైనేజీలను మరమ్మతులు చేయడం, అవసరమైన చోట కొత్త డ్రైనేజీలు, రోడ్లు నిర్మించడం జరుగుతుందని తెలిపారు. వీధి దీపాల నిర్వహణను మెరుగుపరచి అవసరమైన చోట కొత్త లైట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. నగరపాలక సంస్థ కార్యాలయం, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వైద్య కేంద్రాలను కూడా పరిశుభ్రం చేస్తామని తెలిపారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి నగరపాలక సంస్థ కార్మికులకు అందించాలని కోరారు. నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించి నగరంలోని అన్ని డివిజన్లలో పారిశుధ్య పనులు చేపడుతూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతి డివిజన్‌కు అదనంగా 50 మంది కార్మికులను నియమించి ప్రతి రోజు ఐదు డివిజన్లలో పారిశుధ్య పనులు చేపడుతున్నామని చెప్పారు. డ్రైనేజీలు లేని చోట కొత్తగా నిర్మించడం, శిథిలమైన డ్రైనేజీలను మరమ్మతులు చేయడం జరుగుతుందని తెలిపారు. తాగునీటి సరఫరాలో లీకేజీలను గుర్తించి అరికట్టడంతో పాటు ఓపెన్ జిమ్‌లను మరమ్మతులు చేసి అవసరమైన చోట కొత్తవి ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం మాట్లాడుతూ ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 99 రోజుల ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. నగరంలోని అన్ని డివిజన్లలో పారిశుధ్యం మెరుగుపరిచి ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని చెప్పారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఎంఏ షాహిద్ మసూద్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ దిలీప్ కుమార్, కార్పొరేటర్లు భారీ అపర్ణ జితేందర్, సాదవేణి లావణ్య, పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, సిబ్బంది, కార్మికులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సమాచారశాఖలో ప్రజాపాలన

## మొక్కలు నాటిన కమిషనర్



**హైదరాబాద్,మార్చి6 :** జూన్ 12 వరకు 99 రోజుల పాటు నిర్వహిస్తున్న ప్రజా పాలనా - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మాసాబ్ ట్యాంక్ లోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్ ప్రియాంక మొక్కలు నాటారు. కార్యాలయ ఆవరణలో పరిసరాలను కార్యాలయంలోని ప్రతి సెక్షన్ తనిఖీ చేసారు. అనంతరం అధికారులు సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి సెక్షన్ లో ఉన్న ఫైళ్లను సక్రమంగా పరిశుభ్రంగా నిర్వహించాలని, పెండింగ్ లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. నిర్దేశించిన కాలం అనంతరం పాత వార్షిక ఫైళ్లను స్టోర్ రూమ్ నందు క్రమపద్ధతి లో భద్రపరచాలని తెలిపారు. బీరువాలు డెస్కులో రన్నింగ్ ఫైళ్లు మాత్రమే ఉండాలని స్పష్టం చేశారు. అధికారులు సెక్షన్ ఉద్యోగులు గదులను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ తో పాటు సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు,అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్.జగన్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ వి. రాధా కిషన్ ఆర్ఐలు జె. రాములు, పి. జయరాం మూర్తి, ఉప సంచాలకులు యం. మధు సూదన్, వై. వెంకటేశ్వర్లు, ఎస్.ఏ, హష్మి, రాజరెడ్డి కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థుల ఎంపిక



కరీంనగర్: స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ--టెక్నో పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం పెరుగుతుందని, ఒత్తిడి తగ్గుతుందని అన్నారు. జిల్లా స్థాయి పోటీలలో పాఠశాలకు చెందిన డి. సుదీక్ష (9వ తరగతి), కె. లిశిత అక్షయ (8వ తరగతి), జి. శ్రీహరినాథ్ (8వ తరగతి), డి. శ్రీనిత్య (4వ తరగతి) ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ రాష్ట్రస్థాయి పోటీలలోనూ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాలని డాక్టర్ నరేందర్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వాసవి వనిత వాగ్దేవి క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు



కరీంనగర్, జనతా న్యూస్, మార్చి 5: వాసవి వనిత వాగ్దేవి క్లబ్ కరీంనగర్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను గురువారం స్థానిక కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు, అతిథులకు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి జ్యోతి ప్రజ్వలన చేసి శాస్త్రీయ నృత్యాలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా క్లబ్ సభ్యుల కోసం వంటల పోటీలు, ఫ్యాషన్ షో, సాంప్రదాయ దుస్తుల ప్రదర్శనతో పాటు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళలు లక్ష్మి, పార్వతి, సరస్వతి వేషధారణలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు, నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లను క్లబ్ ప్రతినిధులు సన్మానించారు. అనంతరం అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఐఈసీ అధికారి జంధ్యం మాధవి, ఐపీసీ అధికారి పబ్బ అరుణ, జిల్లా కార్యదర్శి ప్రదీప్, రీజియన్ చైర్ పర్సన్ సూర గీత, కోఆర్డినేటర్ రాచమల్ల గాయత్రి, రీజియన్ సెక్రటరీ మాడిశెట్టి ఉమాదేవి, క్యాబినెట్ సెక్రటరీ చందా విజయ, హెల్త్ క్యాంప్ ఇన్‌చార్జ్ డాక్టర్ సౌమ్య, జోనల్ చైర్ పర్సన్ యాంసాని భారతి, క్లబ్ అధ్యక్షులు గంప హరిణి, ప్రధాన కార్యదర్శి కేశెట్టి విశాల, కోశాధికారి ముస్త్యాల సమతతో పాటు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో తుమ్మ ఇషాన్‌కు బంగారు పతకం



కరీంనగర్, జనతా న్యూస్, మార్చి 6: కరీంనగర్ నగరానికి చెందిన తుమ్మ ఇషాన్ జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించాడు. మార్చి 2న కరీంనగర్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆర్చరీ పోటీల్లో అండర్--13 కాంపౌండ్ విభాగంలో పాల్గొన్న ఇషాన్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. కరీంనగర్ పోలీస్ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తుమ్మ ప్రవీణ్ కుమార్ కుమారుడైన ఇషాన్ తన ప్రతిభతో ప్రత్యర్థులను వెనక్కి నెట్టి విజేతగా నిలిచాడు. జిల్లా స్థాయిలో విజయం సాధించిన ఇషాన్ ఈ నెల 8న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఇషాన్ తల్లిదండ్రులు, కోచ్ అభిషేక్ అతడిని అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చూపించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఇషాన్ విజయంపై కరీంనగర్ ఆర్చరీ క్రీడాకారులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు.

# ఆడబిడ్డ పెళ్లికి రూ.5,016 కానుక

తిమ్మాపూర్, జనతా న్యూస్: మన్నెంపల్లి గ్రామ సర్పంచ్ పొన్నం సునీత ఆడబిడ్డల పెళ్లికి కానుకగా రూ.5,016 అందజేస్తూ ఎన్నికల హామీని నిలబెట్టుకుంటున్నారు. గ్రామానికి చెందిన కోలిపాక లక్ష్మి--భూమయ్య కుమార్తె అనూష వివాహానికి హాజరైన సర్పంచ్ సునీత నూతన వధూవరులను ఆశీర్వదించి రూ.5,016 నగదు అందజేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ గ్రామస్తులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో గ్రామంలో జన్మించే ఆడబిడ్డల కోసం స్థిర నిక్షేప పథకం అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బూడిద కిషోర్, వార్డు సభ్యులు బొజ్జ శ్రీనివాస్, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com